

‘రాజముద్ర’ తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575


www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 23.08.2025 | సంపుటి : 2 | సంచిక :201 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 23.08.2025 | volume : 2 | Issue : 201 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

‘రాజముద్ర’ తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575





07

త్వరలో భారత్‌కు
## ఓపెన్ ఏఐ యూనిట్..



02

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా
## కూనంనేని
వరుసగా రెండోసారి ఎన్నిక

# లైసెన్స్‌డు కేబుల్స్ తప్ప అన్నీ తొలగించండి

- పుట్టినరోజు నాడే బాలుడు తండ్రికి కొరివి పెట్టాడు
- ఈ ఘటన తనను ఎంతో కలచి వేసింది
- కేబుల్ వైర్ల తొలగింపు విచారణలో జస్టిస్ బీమపాక

పుట్టిన రోజు నాడే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడు ఘటనపై జస్టిస్ నగేష్ బీమాపాక ఉద్వేగ భరిత వ్యాఖ్యలు చేశారు. కేకు కోయాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు తలకొరివి పెట్టడం తనను తీవ్రంగా కలచి వేసిందని జస్టిస్ నగేష్ భావోద్వేగానికి గురయ్యారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారు చేతులు దులుపుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు బాధ్యులు ఎవరని జస్టిస్ నగేష్ బీమాపాక ప్రశ్నించారు. ఈ ఘటనతో ప్రతి హృదయం పగిలిపోయిందని.. అందరం బాధ్యులమేనని జస్టిస్ నగేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో సమాజం సిగ్గుతో తలదించుకోవాలని జస్టిస్ బీమాపాక నగేష్ చెప్పుకొచ్చారు.



03




03

సీఎస్ఆర్ నిధులతో ప్రతి మండలానికి
## అంబులెన్స్

- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో తెలంగాణకు ముందంజ
- యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలు
- ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి ప్రకటన

నిలిచిన రియల్ మనీ గేమింగ్..
## విత్‌డ్రా మాటేంటి?



నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను అడ్డుకొనేందుకు కేంద్రం తీసుకొచ్చిన గేమింగ్ బిల్లుతో ఆయా సంస్థలు రియల్ మనీ గేమ్‌లను నిలిపివేశాయి. ఈ బిల్లు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందగా.. రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారింది. అయితే.. చట్టంగా రూపాంతరం చెందకముందే వింజో, నజారా టెక్నాలజీస్ వంటి ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్ రియల్ మనీ గేమ్స్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో పోకర్‌బాజీ పేరిట ఆన్‌లైన్ గేములు నిర్వహించే మూన్‌షైన్ టెక్నాలజీస్ తన కార్యకలాపాలు నిలిపివేసింది. ఇప్పటికే వాలెట్‌లో సొమ్ములున్నవారికి విత్‌డ్రాకు అనుమతిస్తామని పేర్కొంది.

07

50 గంటల అరెస్ట్‌తో ఉద్యోగాలే పోతుంటే..
# పీఎం, సీఎంలకు ఊరటా?

- అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదు
- దీనిపై చట్టం తీసుకుని వస్తే వ్యతిరేకిస్తే ఎలా?
- బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ వెల్లడి

06

**పాట్నా, ఆగస్ట్ 22 :**

అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదని, దీనిని సమర్థించే నేతలకు ప్రజలే బుద్ది చెబుతారని ప్రధాని మోడీ అన్నారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు.. జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ ప్రశ్నించారు. తప్పు చేస్తే సీఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఉంటే జైల్లో.. లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు.



కుక్కలకు వీధుల్లో
# ఆహారం పెట్టొద్దు

- వీధికుక్కల బెడదపై సుప్రీం కీలక ఆదేశాలు
- బహిరంగ ప్రదేశాల్లో ఆహారం నిషేధం
- నిర్దేశిత స్థలాల్లోనే ఆహార ఏర్పాట్లు



04

హైకోర్టులో కేసీఆర్, హరీష్‌రావుకు
# ఎదురుదెబ్బ

## పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై స్టేకు నిరాకరణ

- అసెంబ్లీలో చర్చ అనంతరం మాత్రమే తదుపరి చర్యలు : ప్రభుత్వం
- హైకోర్టు విచారణ నాలుగు వారాలకు వాయిదా




**హైదరాబాద్, ఆగస్టు 22 :**
మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్), మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రూపొందిన కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలన్న వారి విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో విచారణ నాలుగు వారాలకు వాయిదా వేస్తూ, పూర్తి స్థాయి కౌంటర్‌ను దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ తరపున హైకోర్టుకు ఇచ్చిన వివరణలో, “పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు తీసుకుంటాం,” అని స్పష్టం చేసింది. కేసీఆర్, హరీష్‌రావు ప్రస్తుతం శాసనసభ సభ్యులే కావడంతో, అసెంబ్లీలో చర్చ అనంతరం చర్యలు చేపడతామని తెలిపింది.

మిగతా 3 లో



కేజ్రీవాల్ జైలులో ఉండి
## ప్రభుత్వాన్ని నడిపారు

- రేపు ఎవరైనా ఇలాగే చేస్తే ఎలా?
- అందుకే అవినీతి కేసుల్లో సమస్య రాకుండా చట్టం అవసరం
- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా

02



## వైద్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం
1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



రాజకీయ పార్టీల తీరుపై
## సుప్రీం ఆశ్చర్యం

- బూత్ స్థాయిలో ఓటర్లకు సాయం చేయాలని సుప్రీం సూచన
- ఓటు సవరణకు గడువు పెంచాలని ఈసీకి ఆదేశం

06



పార్లమెంట్ వద్ద
## భద్రతా వైఫల్యం

- భద్రతా సిబ్బంది కళ్లుగప్పి గోడదూకిన ఆగంతకుడు
- వెంటనే అప్రమత్తం అయిన పట్టుకున్న సిబ్బంది

06






## బీజేపీ అంటే భయమెందుకు?

- ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును అణచివేయడమేనా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్ట్‌పై తీవ్ర స్పందనలు



03



కేసీఆర్ పాలనలో
## యూరియా కొరతేలేదు

- అసమర్థ పాలకుల వల్లే రైతులు రోడ్డెక్కే పరిస్థితి
- కేసీఆర్ ముందస్తు ప్రణాళికతో వ్యవస్థను నడిపించారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

03

# చిమ్మ చీకట్లో విశ్వనగరం

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** విద్యుత్ సరఫరా గురించి గొప్పలు చెబుతున్న ప్రభుత్వం వీధి లైట్లు వెలగని నగరం దేశంలో ఏదైనా ఉందంటే అది హైదరాబాదేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చీకటి పడితే వీధిలైట్లు- వెలగక దయనీయమైన పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కడ ఉందో అక్కడే వెలుగు లా అని విమర్శించారు. ప్రభుత్వం రియల్ హైదరాబాద్ వదిలేసి.. రియల్ ఎస్టేట్ హైదరాబాద్ చుట్టూ తిరుగుతోందని ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ విశ్వ నగరం అన్నారు.. రేవంత్‌రెడ్డి అంతకన్నా మహా విశ్వనగరం అంటున్నారని ఎద్దేవా చేశారు. చిమ్మ చీకట్లు అలముకోవడం మహానగరమా? అని ప్రశ్నించారు. మౌలిక వసతుల్లేక నగర ప్రజలు అల్లాడుతున్నారన్నారు. హౌస్ అరె-స్టులు చేసేంత భయం ప్రభుత్వానికి ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని, పార్టీ నేతలను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. అరెస్ట్‌లకు భయపడేది లేదని, అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. బేషరతుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

# కేజ్రీవాల్ జైలులో ఉండి ప్రభుత్వాన్ని నడిపారు


- రేపు ఎవరైనా ఇలాగే చేస్తే ఎలా?
- అందుకే అవినీతి కేసుల్లో సమస్య రాకుండా చట్టం అవసరం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**తిరువనంతపురం, ఆగస్టు 22 :** తప్పుడు పనులు చేసిన నాయకులను పదవుల నుండి తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమర్థించారు. అవినీతి తదితర ఆరోపణలతో జైలుకు వెళ్లినా, పదవులు కలిగి ఉండటం వల్లే ఈ చట్టం అవసరమైందని అన్నారు. కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్ స్వాతంత్ర్యం పొందిన 75 ఏళ్లలో ఇలాంటి చట్టం ఎప్పుడూ రాలేదు. కానీ ఇది ఎంత అవసరమో కేజ్రీవాల్ ఉదాహరణ ద్వారా తెలుస్తోంది," అని పేర్కొన్నారు. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జైలులో ఉండి సీఎంగా ప్రభుత్వాన్ని నడిపారని చెప్పారు. "జైలులో ఉండి ప్రభుత్వం నడిపే సీఎం దేశానికి అవసరమా? నైతికత ఎక్కడ ఉంది?" అని ప్రశ్నించారు. కేజ్రీవాల్ లిక్కర్ పాలసీ కుంభకోణంలో జైలుకు వెళ్లినప్పటికీ, ప్రభుత్వాధికారం ఆయన చేతిలోనే అయిందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ సవరణ అవసరమా? అని ప్రశ్నించారు. గతంలో ఢిల్లీని బీజేపీ ప్రభుత్వం పాలించినా, ఇలాంటి దుస్థితి ఎప్పుడూ రాలేదన్నారు. "కేజ్రీవాల్ అరెస్టైన వెంటనే సీఎం పదవికి రాజీనామా చేసి ఉంటే ఈ బిల్లుకు అవసరం ఉండేది కాదు," అని పేర్కొన్నారు. రాజ్యాంగం రూపకల్పన సమయంలో ఇలాంటి పరిస్థితులను ఊహించలేకపోయి ఉండవచ్చని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో జైలుకు వెళ్లే వ్యక్తులు ప్రజాప్రతినిధులవుతారని అప్పట్లో ఊహించలేకపోయి ఉండవచ్చు అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అయినా, ప్రతిపక్షాలైనా నైతిక బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తీవ్రమైన నేరారోపణలపై అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే, ప్రధానమంత్రి అయినా, కేంద్ర మంత్రి అయినా పదవి నుంచి తొలగించే అవకాశం కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించారు. ఈ బిల్లులో కనీసం 5 ఏళ్ల శిక్షకు లోబడి, నెల రోజులు జైలు శిక్ష అనుభవించిన నేతలు 31వ రోజున తమ పదవిని కోల్పోయేలా నిబంధన చేర్చారు. వారు స్వయంగా రాజీనామా చేయకపోయినా, కొత్త నిబంధనల ప్రకారం పదవికి అర్హులు కారు.

### కాంగ్రెస్, సుదర్శన్ రెడ్డి మీద ఆగ్రహం

కోచ్చిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీపై, ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వామపక్ష తీవ్రవాదానికి అనుకూలంగా తీర్పులు ఇచ్చారని ఆరోపించారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ ఆయనను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసిందని అన్నారు. "ఇది కేరళలో కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాన్ని కూడా దెబ్బతీసింది," అని విమర్శించారు. సల్వా జుడుం వంటి దేశ రక్షణ చర్యలకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చిన వ్యక్తి ఇప్పుడిప్పుడు ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలవడం విచారకరం అని అన్నారు. 2011లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్ఎస్ నిజ్జర్‌ల ధర్మాసనం సల్వా జుడుంను రద్దు చేసింది. సల్వా జుడుం అనేది కొంతమంది గిరిజన యువకులతో మావోయిస్టుల తిరుగుబాటుకు వ్యతిరేకంగా ఏర్పాటైన గిరిజన దళం. "ఆ రోజు ఆ తీర్పు రాలిఇపోతే, 2020 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమై ఉండేది," అని అమిత్ షా అన్నారు.



# భారత్‌లో మళ్లీ 'టిక్‌టాక్'?

## ఐదేళ్ల తర్వాత అందుబాటులోకి వెబ్‌సైట్

**న్యూఢిల్లీ :** ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ సేవలు భారత్‌లో మళ్లీ అందుబాటులోకి రాబోతున్నాయా? ఇప్పుడిదే చర్చ జాతీయ మీడియాలో నడుస్తోంది. దాదాపు ఐదేళ్ల తర్వాత తొలిసారి టిక్‌టాక్ వెబ్‌సైట్ అనేకమందికి అందుబాటులోకి రావడమే ఈ తరహా చర్చకు కారణమైంది. 2020లో సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతాపరమైన కారణాలతో చైనాకు చెందిన ఈ వీడియో మేకింగ్ ప్లాట్‌ఫామ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధించిన విషయం తెలిసిందే. అయితే, శుక్రవారం చాలా మంది యూజర్లు తమకు టిక్‌టాక్ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. అయి-ంతే, టిక్‌టాక్ యాప్ మాత్రం ఇప్పటివరకు ప్లేస్టోర్‌లో అందుబాటులోకి రాలేదు. 2020 జూన్‌లో 59 యాప్‌లు, సెప్టెంబర్‌లో మరో 118 చైనీస్ యాప్‌లపై భారత ప్రభుత్వం నిషేధం విధించి ఆ దేశ కంపెనీలకు గట్టి షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. సరిహద్దులోని గల్వాన్ వద్ద భీకర ఘర్షణ తర్వాత చైనా తీరు పట్ల దేశంలో అనేక అనుమానాలు వ్యక్తమై భారతీయుల సమాచార భద్రత, గోప్యత, దేశ సార్వభౌమత్వానికి భంగం కలుగుతోందన్న కారణాల రీత్యా టిక్‌టాక్, హెలో, పబ్‌జీ, షేరిట్, యూసీ బ్రౌజర్, బైడు మ్యాప్, క్లాష్ ఆఫ్ కింగ్స్ వంటి యాప్‌లపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్, చైనాలపై టారిఫ్‌లు పెంచడం, తాజాగా భారత్, చైనా మధ్య సంబంధాలు మెరుగుపడుతున్న సమయంలో ఈ తరహా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ భారత్‌ను సందర్శించి ట్రంప్ సుంకాలకు వ్యతిరేకిస్తూ భారత్‌కు చైనా మద్దతును ప్రకటించారు. అలాగే, ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌లను కలిశారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1వరకు చైనాలో జరగనున్న షాంఘై సహకార సదస్సుకు ప్రధానిని ఆహ్వానించిన విషయం తెలిసిందే.

# యూరియా కొరత పేరిట చెప్పుల రాజకీయం

- కేంద్రం నుంచి యూరియా సరఫరాలో కొంత ఆలస్యం
- కావాలనే రైతులను బజారుకీడుస్తున్నారు
- ఎంపీ రఘునందన్ రావు



**సిద్దిపేట, ఆగస్ట్ 22 :** యూరియా సరఫరాలో ఆలస్యం "ఆపరేషన్ సిందూర్" కారణంగా ఏర్పడిందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు తెలిపారు. శుక్రవారం సిద్ధిపేటలో విలేకర్లతో మాట్లాడుతూ, కొంతమంది కావాలని యూరియా కొరత పేరుతో రైతులను బజారుకీడుస్తూ, చెప్పులను లైన్‌లో పెట్టించి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వారంలోపు రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాలిలి తీసుకొస్తామని హామీ ఇచ్చిన ఎంపీ, రైతులకు ఎరువులు అందజేయేది బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కాదని, కేంద్ర ప్రభుత్వం మాత్రమేనని స్పష్టం చేశారు. "రైతులకు సరిపడే యూరియా వారం రోజుల్లో అందించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. కొందరు కావాలని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం" అని ఆయన తెలిపారు. రాజకీయ నాయకుల తప్పుడు ఆరోపణలను నమ్మకుండా రైతులు శాంతంగా ఉండాలని సూచించారు. ఫ్లెక్సీల కోసం దిగజారి చేసే రాజకీయం తాము చేయబోమని స్పష్టం చేసిన రఘునందన్ రావు, "ఇలాంటి తప్పుడు పథకాలు నమ్మే వారిని ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఉపేక్షించరు. డిపాజిట్ కూడా రాదు," అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీపై రాష్ట్రాల మధ్య వివక్ష చూపుతున్నారని కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించిన ఎంపీ, "రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉన్నా కేంద్రం సమాన దృష్టితో నిధులు కేటాయిస్తుంది" అని స్పష్టం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, అంగన్వాడీ కేంద్రానికి రూ. 10 లక్షల చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో 26 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 2.8 కోట్లు, మెదక్ జిల్లాలో 27 కేంద్రాలకు రూ. 2.10 కోట్లు, మొత్తంగా మెదక్ లోక్‌సభ పరిధిలో 56 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 4.6 కోట్లు నిధులు కేటాయించామని తెలిపారు. "పనుల జాతర పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల్లో 75 శాతం నిధులు కేంద్రమే అందించగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 25 శాతం మాత్రమే ఖర్చు పెట్టింది" అని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు కేంద్రం ఇచ్చిన నిధులతోనే తమ పేర్లు ప్రకటించుకుంటూ "పనుల జాతర" పేరుతో ప్రదర్శనలు చేస్తుంటే, ప్రజలు మోసపోరాదని ఆయన పేర్కొన్నారు.

# 25న తెలంగాణ కేబినేట్ భేటీ

- బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై చర్చ
- కాళేశ్వరం నివేదికపైనా చర్చించే అవకాశం

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** తెలంగాణ మంత్రివర్గ సమావేశం సచివాలయంలో ఈనెల 25న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. మరోవైపు పంచాయతీ ఎన్నికల కోసం హైకోర్టు విధించిన గడువు సెప్టెంబరు 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముంది. శనివారం జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ- సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు- ఇవ్వాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న కేబినెట్ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం.. ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచాం పంపించే వీలుంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక అంశంలో హైకోర్టు విచారణపై కూడా చర్చించి.. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా నిర్ణయం తీసునే అవకాశం ఉంది. దీనికోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాళేశ్వరం నివేదికపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఇటీవల హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం చర్యలు తీసుకుంటామని న్యాయస్థానానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టేందుకు ఈ భేటీలో తేదీలను ఖరారు చేయనున్నట్టుగా తెలుస్తోంది.

# పార్లమెంట్‌ను అపహాస్యం చేసిన కాంగ్రెస్

- సమావేశల్లో చర్చించకుండా కాలయాపన
- వెంకయ్య నాయుడు పోటీ చేసినప్పుడు తెలుగు ప్రైడ్ గుర్తుకు రాలేదా
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి లక్ష్మణ్



**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** వర్షాకాల పార్లమెం ట్ సమావేశాలు ముగిశాయి. 21 రోజుల వాడివేడిగా సాగిన పార్లమెంట్ సమావే శాలు గురువారంతో ముగిసినట్లు బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ అలజడి, అల్లర్లు చేస్తూ.. ప్రజా స్వామ్యానికి మచ్చతెచ్చేలా వ్యవహరించిం దని ఆరోపించారు. కాంగ్రెస్ ద్వంద నీతి అవలంబించిందని విమర్శించారు. మణి పూర్, ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగా లని మొదట డిమాండ్ చేసిందని పేర్కొ న్నారు. రాజ్యసభలో ఆపరేషన్ సింధూర్ చర్చలో పాల్గొనకుండా తోకముడిచిందని ఆయన ఎద్దేవా చేశారు. పదిహేను బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం తెలిపితే ఒక్క చర్చలో కూడా కాంగ్రెస్ పాల్గొనలేదని తెలిపారు. చర్చలో పాల్గొనకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్‌కి ఎజెండా లేకుండా పోయిందని విమర్శించారు. పార్లమెంట్‌లో లేని చర్చకు ఆరోపణలతో రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. చరిత్మకమైన బిల్లులో కాంగ్రెస్ ఎక్కడ చర్చకు రాలేదని స్పష్టం చేశారు. జైల్లో అవినీతి నేతలు ఉండాలని బిల్లు పెడితే కాంగ్రెస్ నేతలు దాన్ని అడ్డుకొని బిల్లులు చించేశారని చెప్పుకొచ్చారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెడతామని చెప్పారు కానీ ఇప్పుడు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలను భ్రమలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సదుర్శన్ రెడ్డి తెలుగు ప్రైడ్ అని రేవంత్ రెడ్డి అంటు-న్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు. గతంలో పీవీ నరసింహారావును కాంగ్రెస్ ఎలా ఇబ్బంది పెట్టిందో చూశామని తెలిపారు. టి.అంజయ్యను ఏ విధంగా అవమానించారో ప్రజలకు తెలుసని చెప్పుకొచ్చారు. తెలుగు వారైనా వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పోటీ- చేస్తే అప్పుడు కాంగ్రెస్ ఎందుకు మద్దతు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలుగు వాడి ఆత్మగౌరవం కోసం ఆరోజు కి పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఆయనను రాజకీయాల్లో నైతిక విలువలు లేకుండా చేశారని కాంగ్రెస్ విమర్శించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమర్జెన్సీ రోజుల్లో అధికారాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని ధ్వజమెత్తారు. పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ నైజం బయటపడిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి వారి వైఖరి మార్చుకోవాలని లక్ష్మణ్ హితవు పలికారు.

# ఉమ్మడి జిల్లా అభివృద్ధికి 1200కోట్లు విడుదల

## మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరు

**వరంగల్, ఆగస్ట్ 22 :** ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పనుల కోసం తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిధులు విడుదల అయ్యాయి. మంత్రి సీతక్క చొరవతో పంచాయతీరాజ్ శాఖకు రూ.1200 కోట్లు- నిధులు విడుదలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఇంటిగ్రేటెడ్ భవనాలు, అదేవిధంగా ఎంపీపీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. మరోవైపు.. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడ మండలాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పథకాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఉద్ఘాటించారు మంత్రి సీతక్క. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని స్పష్టం చేశారు. గృహజ్యోతి పథకం కింద రూ.500లకే సబ్సిడీ గ్యాస్ పంపిణీ చేస్తున్నామని వివరించారు. ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని మంత్రి సీతక్క కోరారు.



# ఏసీబీకి చిక్కిన వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్

**హైదరాబాద్:** వనస్థ లిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం పరిధి లోని తుర్కయాంజల్‌కు చెంది న ఓ వ్యక్తికి 200 గజాల స్థలం ఉంది. ఆ స్థలం రిజిస్ట్రే షన్‌కు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ రాజేశ్‌ను సంప్రదిం చారు. ప్లాటు రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేయగా.. రూ. 70వేలకు బేరం కుదిరింది. దీనిపై ప్లాటు యజమాని ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. శుక్రవారం రూ.70వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ రమేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడిని విచారించగా సబ్‌రిజిస్ట్రార్ సూచన మేరకే డబ్బులు తీసుకున్నట్లు తెలిపాడు. ఏసీబీ అధికారులు సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్‌తో పాటు రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



# సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని

## వరుసగా రెండోసారి ఎన్నిక

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరోసారి ఎన్నికయ్యారు. గాజులరామారంలో జరిగిన సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల్లో ఆయన పేరును పార్టీ సీనియర్ నేత పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా.. మరో నేత శంకర్ బలపరిచారు. కూనంనేని వరుసగా రెండోసారి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మూడేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన సాంబశివరావు పార్టీలో సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. విశాలాంధ్ర పత్రికలో జర్నలిస్టుగానూ పనిచేశారు. 1984లో కొత్తగూడెం పట్టణ సీపీఐ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1987లో అత్యంత ప్రతిష్మాత్మకంగా జరిగిన కొత్తగూడెం మండల పరిషత్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మండలాధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. 2005లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో సుజాతనగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2009లో కొత్తగూడెం నుంచి పోటీ చేసి.. అప్పటి మంత్రి వనమా వెంకటేశ్వరరావును ఓడించి శాసనసభలో అడుగుపెట్టారు. రాష్ట్ర ఆకాంక్షను గుర్తించి ఖమ్మం జిల్లాలో 450 కి.మీ. పాదయాత్ర నిర్వహించారు. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

# సూర్యాపేటలో సుపారీ గ్యాంగ్ కలకలం

## మర్డర్ నుంచి తప్పించుకున్న ముగ్గురు

**సూర్యాపేట, ఆగస్ట్ 22 :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో మరోసారి సుపారీ మర్డర్ యత్నం బయటపడడంతో స్థానికంగా కలకలం చెలరేగింది. సమాచారం ప్రకారం, ఓ బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురిని లక్ష్యంగా చేసుకుని ఒక సుపారీ గ్యాంగ్ కారులో వెంబడించింది. అప్రమత్తమైన వారు వెంటనే బైక్ దిగి సమీపంలోని వైన్స్‌లోకి పరుగెత్తడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వైన్స్‌లో ఉన్న స్థానికులు గ్యాంగ్‌పై దాడికి దిగగా, పరిస్థితి చేజారిపోతుందనుకున్న వారు తాము వచ్చిన కారులో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సంఘటనతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. ఇక, ఇదే ప్రాంతంలో రెండు నెలల క్రితం కూడా ఇలాంటి సుపారీ మర్డర్ యత్నం జరిగినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. అప్పటి నుంచి పెద్దగా శాంతించని ఈ పరిణామాలు మళ్లీ చోటు-చేసుకోవడంతో ఇక్కడ సుపారీ గ్యాంగ్‌ల దాడులు పెరుగుతున్నాయా?' అనే సందేహం కలుగుతోంది. వరుసగా ఇలాంటి ఘటనలు జరగడం వల్ల సూర్యాపేటలో భయాందోళనలు మరింత పెరిగాయి.

# కావేరీ-గోదావరిల అనుసంధానం

## బనకచర్లపై చర్చ రాలేదన్న రాహుల్ బొజ్జా

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** గోదావరి- కావేరి నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదింపుల భేటీ- ముగిసింది. మరోమారు సమావేశం నిర్వహిస్తామని సీడబ్ల్యూసీ ఛైర్మన్ అతుల్ జైన్ వెల్లడించా రు. నదుల అనుసంధానంపై రాష్ట్ర అభిప్రాయాలు వివరించినట్లు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వెళ్తున్న నీటిలో సగం అంటే.. 74 టీఎంసీలు కోరినట్లు- తెలిపా రు. ఏపీ నాలుగు ఇంట్రా లింక్‌లను ప్రతిపాదించింది. తెలంగాణ సమ్మతి లేకుండా ఇంట్రా లింకులు ఆమోదించవద్దని కోరాం. బనకచర్ల లింక్ అంశం అంతగా చర్చకు రాలేదు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర అభిప్రాయాలను గతంలోనే చెప్పామని రాహుల్ బొజ్జా వివరించారు.

# హైకోర్టులో కేసీఆర్, హరీష్‌రావుకు ఎదురుదెబ్బ

## పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై స్టేకు నిరాకరణ

- అసెంబ్లీలో చర్చ అనంతరం మాత్రమే తదుపరి చర్యలు : ప్రభుత్వం
- హైకోర్టు విచారణ నాలుగు వారాలకు వాయిదా



**హైదరాబాద్, ఆగస్టు 22 :** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్), మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రూపొందిన కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలన్న వారి విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో విచారణ నాలుగు వారాలకు వాయిదా వేస్తూ, పూర్తి స్థాయి కౌంటర్‌ను దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ తరపున హైకోర్టుకు ఇచ్చిన వివరణలో, "పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు తీసుకుంటాం," అని స్పష్టం చేసింది. కేసీఆర్, హరీష్‌రావు ప్రస్తుతం శాసనసభ సభ్యులే కావడంతో, అసెంబ్లీలో చర్చ అనంతరం చర్యలు చేపడతామని తెలిపింది.

### హైకోర్టు ఆగ్రహం

కమిషన్ నివేదికను ముందుగానే మీడియాకు అందుబాటులోకి తీసుకురావడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. 60 పేజీల నివేదికను అసెంబ్లీలో చర్చించకముందే బహిర్గతం చేయడాన్ని తప్పుపడింది. వెంటనే ఆ నివేదికను అన్ని ప్రజా వేదికల నుంచి తొలగించాలని ఆదేశించింది. అదే సమయంలో, కమిషన్ 8ఇ, 8ఈ నోటీసులు జారీ చేయకుండానే పిటిషనర్లపై ఆరోపణలు చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు అభిప్రాయపడింది. మూడు వారాల వ్యవధిలో దీనిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### స్టే ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం

ఈ కేసులో కేసీఆర్, హరీష్‌రావు తరఫున న్యాయవాది సుందరం వాదనలు వినిపిస్తూ, కమిషన్ నివేదికపై తాత్కాలిక ఉత్తర్వులు (స్టే) ఇవ్వాలని కోరారు. "ఈ నివేదిక ఆధారంగా మా పిటిషనర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అటువంటి పరిణామాలను నివారించేం దుకు స్టే ఇవ్వాలి," అని విన్నవించారు. అయితే హైకోర్టు మాత్రం, "ప్రస్తుతం మధ్యంతర ఉత్తర్వుల అవసరం లేదు," అని తేల్చిచెప్పింది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లోకి వెళ్లిందని గుర్తిస్తూ, దానిని వెంటనే తొలగించాలని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

### రాజకీయ కక్షసాధింపేనా?

బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల పై కమిషన్ నివేదిక ప్రభుత్వం అందజేసిన నివేదికలో పేర్కొనబడింది. ఈ నివేదికపై బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించి, "ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు కోణంలో తీసిన చర్య," అని ఆరోపించారు. కమిషన్ దాదాపు 13 నెలల పాటు విచా రణ జరిపింది. వందలాది మందిని పిలిపించి సమాచారం సేకరించగా, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లను కూడా విచారించింది. నివేదికలో కేసీఆర్‌నే ప్రధాన బాధ్యుడిగా పేర్కొంది. ఈ నేపథ్యంతో, కమిషన్ నివేదికను రద్దు చేయాలని వారు హైకోర్టును ఆశ్రయించారు. కానీ ప్రస్తుతానికి హైకోర్టు స్టే ఇవ్వడానికి అంగీకరించలేదు. తదుపరి విచారణకు ఇంకా నాలుగు వారాల సమయం ఉంది.

---

## సీఎస్ఆర్ నిధులతో ప్రతి మండలానికి అంబులెన్స్

- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో తెలంగాణకు ముందంజ
- యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలు
- ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి ప్రకటన



**హైదరాబాద్, ఆగస్టు 22 :** ప్రతి మండలానికి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దీనికి కావాల్సిన నిధులను కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ఫండ్ల ద్వారా సమకూరుస్తామని తెలిపారు. ప్రజాభవన్‌లో యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న భట్టి, మొత్తం 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆ రోజు భూములు ఇచ్చింది ఇంది రమ్మ, ఈ రోజు ఉద్యోగాలు ఇస్తోంది ఇందిరమ్మ సర్కారే" అని పేర్కొన్నారు.

### విద్యుత్ సరఫరా - కాంగ్రెస్ పాలనలో విశ్వాసం

"కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కొందరు తప్పుడు ప్రచారం చేశారు. కానీ నేడు, కాంగ్రెస్ అంటేనే కరెంట్ అని మేం నిరూపించాము," అని భట్టి స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక తాము తీసుకొచ్చిన కొత్త ఎనర్జీ పాలసీ ద్వారా రాష్ట్రాన్ని విద్యుత్ లోటు రహితంగా నిలిపామని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం 29 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్ అందించబడుతోందని, అలాగే 51 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందించబడుతోందని చెప్పారు. విద్యుత్ శాఖకు ఏటా రూ. 17,000 కోట్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.

### విద్యతో పేదరిక నిర్మూలన

విద్య ద్వారా పేదరికాన్ని, సామాజిక-ఆర్థిక వెనుకబాటుతనాన్ని జయించవచ్చని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. సీఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్'ను 25 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 2,600 మంది విద్యార్థులకు వసతి, విద్యా సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఇక విద్య, ఉద్యోగ అవకాశాల కల్పన ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని, తాము ఆ దిశగా ముందుకెళు న్నామని ఉపముఖ్యమంత్రి అన్నారు.

### గ్రీన్ ఎనర్జీలో తెలంగాణకు ప్రాధాన్యత

కన్వెన్షనల్, నాన్ కన్వెన్షనల్ శక్తి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. నూతన శక్తి విధానాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలులోకి తీసుకువచ్చామని, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా పలువురు ముఖ్య వ్యక్తులు పాల్గొన్నారు.

---

## సహస్ర హంతకుడు పక్కింటి బాలుడు

- దొంగతనానికి వచ్చి హత్య చేసినట్లు గుర్తింపు
- బాలుడిని అదుపులోకి తీసుకుని విచారణ

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** నగరాన్ని కలచివేసిన కూకట్‌పల్లి బాలిక సహస్ర హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. 12 ఏళ్ల బాలికను హత్య చేసిన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు అనుమానితులపై దృష్టి సారించగా, సహస్ర ఇంటికి పక్కనే ఉన్న భవనంలో నివసిస్తున్న పదవ తరగతి విద్యార్థి ఈ హత్యకు కారణమని తేలింది. అతడు దొంగతనం కోసం సహస్ర ఇంట్లోకి వెళ్లగా, ఆ సమయంలో బాలికను చూసి భయపడి ఆమెను హతమార్చినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సహస్ర హత్య వెనుక ఉన్న నిజం వెలుగులోకి రావడంతో, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనతో కూకట్‌పల్లి ప్రాంతం తీవ్ర కలకలం రేపింది. చిన్నారి హత్యకు కారణమైన నిందితుడు ఒక స్కూల్ విద్యార్థి కావడం స్థానికులను మరింత షాక్‌కు గురి చేసింది. ప్రస్తుతం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## లైసెన్స్‌డు కేబుల్స్ తప్ప అన్నీ తొలగించండి

- పుట్టినరోజు నాడే బాలుడు తండ్రికి కొరివి పెట్టాడు
- ఈ ఘటన తనను ఎంతో కలచి వేసింది
- కేబుల్ వైర్ల తొలగింపు విచారణలో జస్టిస్ బీమపాక

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** పుట్టిన రోజు నాడే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడు ఘటనపై జస్టిస్ నగేష్ బీమాపాక ఉద్వేగ భరిత వ్యాఖ్యలు చేశారు. కేకు కోయాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు తలకొరివి పెట్టడం తనను తీవ్రంగా కలచి వేసిందని జస్టిస్ నగేష్ భావోద్వేగానికి గురయ్యారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారు చేతులు దులుపుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు బాధ్యులు ఎవరని జస్టిస్ నగేష్ బీమాపాక ప్రశ్నించారు. ఈ ఘటనతో ప్రతి హృదయం పగిలిపోయిందని.. అందరం బాధ్యులమేనని జస్టిస్ నగేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో సమాజం సిగ్గుతో తలదించుకోవాలని జస్టిస్ బీమాపాక నగేష్ చెప్పుకొచ్చారు. నెట్‌వర్క్ కేబుల్ వైర్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. రామంతాపూర్ ఘటన తర్వాత హైదరాబాద్‌లోని పలు ఏరియాల్లో కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు కట్ చేశారు. వైర్లకు తిరిగి కనెక్షన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ఎయిర్టెల్ సంస్థ కోరింది. అయితే, ఎయిర్టెల్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. లైసెన్సు తీసుకున్న కేబుల్స్ తప్ప ఏవీ ఉంచవద్దని జస్టిస్ నగేష్ బీమాపాక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటంపై జస్టిస్ నాగేష్ బీమాపాక సీరియస్ అయ్యారు. రామంతాపూర్‌లో ఐదుగురు మరణించిన ఘటనను ఈ సందర్భంగా జడ్జి ప్రస్తావించారు. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.

---

## బీజేపీ అంటేనే భయమెందుకు?

- ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును అణచివేయడమేనా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్ట్‌పై తీవ్ర స్పందనలు



**హైదరాబాద్, ఆగస్టు 22 :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కర్రె రామచందర్‌రావును పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ నేతలు తీవ్రంగా స్పందించారు. చేవెళ్లలో పార్టీ కార్యకమానికి వెళ్లుతున్న సమయంలో మొయినాబాద్ వద్ద ఆయనను అరెస్ట్ చేయడాన్ని బీజేపీ ఖండించింది. కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, "పార్టీ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న నేతను ఎందుకు అరెస్ట్ చేశారు?" అంటూ పోలీసులను ప్రశ్నించారు. "ఇది పూర్తిగా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గతంలో బీఆర్ఎస్ అవలంబించిన దమన విధానాలనే అనుసరిస్తోంది," అంటూ మండిపడ్డారు.

### "అక్రమ అరెస్టులు.. వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం"

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు బీజేపీ నేతలపై అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని బండి సంజయ్ ఆరోపించారు. "బీజేపీ అంటే అంత భయమెందుకు?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. "ప్రజాస్వామ్య విధానాల్లో నమ్మకముంటే, నిరసనల్ని అణచివేయకుండా, ప్రజల సమస్యల్ని ఎదుర్కొనాలి. అరెస్టులతో రాజకీయం నడిపితే ప్రజలు సమాధానం చెబుతారు," అని హెచ్చరించారు.

### సమస్యల పరిష్కారానికే నిరసన : ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్ కూడా రామచందర్‌రావు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చాం. కానీ ప్రభుత్వ ప్రతిస్పందన మాత్రం అరెస్టులు. ఇది పూర్తిగా నిరంకుశ చర్య," అని చెప్పారు. అరెస్టయిన నేతలు, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని ఈటల డిమాండ్ చేశారు. చేయాల్సింది అరెస్టులు కాదు.. ప్రజల సమస్యల పరిష్కారం" అని స్పష్టం చేశారు.

---

## కేసీఆర్ పాలనలో యూరియా కొరతేలేదు

- అసమర్థ పాలకుల వల్లే రైతులు రోడ్డెక్కే పరిస్థితి
- కేసీఆర్ ముందస్తు ప్రణాళికతో వ్యవస్థను నడిపించారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 22 :** తెలంగాణలో యూ రియా కొరత ఇప్పటివరకు ఎప్పుడూ తలెత్త లేదని, ఇది పూర్తిగా ప్రస్తుతం పాలిస్తున్న అసమ-ర్థుల వైఫల్యమేనని బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ఎరువుల సరఫరాకు ముందస్తు ప్రణాళికల తో వ్యవస్థను సమర్థంగా నడిపారని గుర్తు చేశారు. "కేసీఆర్ ఆలోచనల్లో ముందస్తు ప్రణాళిక ముఖ్యమైనది. వ్యవసాయ శాఖ నుంచి రైల్వే శాఖ వరకు స్వయంగా సమన్వయం చేస్తూ, గూడ్స్ రైళ్లను, వేల లారీలను రంగంలోకి దించి గ్రామస్థాయి లోనే యూరియా అందించేలా చర్యలు తీసుకున్నారు," అని కేటీఆర్ వివరిం చారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో వరి, పత్తి, కందులు, మొక్కజొన్న, మిర్చి వంటి పంటలకు యూరియా అవసరమవుతోంది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎరువుల కొరత వల్ల రైతులు సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్ద బారులు తీరుతున్నారని ఆయన విమర్శించారు. "కేసీఆర్ హయాంలో ఒక్కసారి కూడా రైతులు ఎరువుల కొరతపై రోడ్డెక్కలేదు. ధర్నాలు చేయలేదు. కానీ ఇప్పుడు రైతులు పట్టాపాస్ పుస్తకాలు, చెప్పులు వేసి వరుసలో నిలబడుతున్నారు. కొందరు అక్కడే నిద్రిస్తున్నారు. ఇది పాలనలో అసమర్థతకు నిదర్శనం," అని మండిపడ్డారు. కేటీఆర్ మాట్లాడుతూ, "సీజన్ మొదలయ్యేలోపు కేంద్రానికి లెక్కలతో సహా వినతులు పంపించేవారు కేసీఆర్. ఏపీలో నౌకాశ్రయాలకు అధికారులు పంపించి స్పష్టమైన ఆదేశాలు తెప్పించేవారు. దక్షిణమధ్య రైల్వేకి స్వయంగా ఫోన్ చేసి గూడ్స్ రైళ్లకు డిమాండ్ చేసేవారు. ఇది మాత్రమే కాదు, పొరుగు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో నేరుగా సంప్రదింపులు జరిపేవారు," అని వివరించారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని, పాలన అంటే ఏమిటో తెలియని వారే ఇప్పుడు అధికారంలో ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. "వారు బూతులు మాట్లాడటమే కాకుండా, చిల్లర రాజకీయాలతో వ్యవసాయాన్ని నాశనం చేస్తున్నారు. వందేళ్ల దూరదృష్టి ఉన్న నాయకుడు కేసీఆర్. ఆయన పాలన విలువ ఇప్పుడు ప్రజలకు అర్థమవుతోంది," అని అన్నారు.

---



## వైద్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం

### 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్‌లో 1616, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు విధించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ పోస్టుల భర్తీతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగనున్నాయి. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ- హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ- వైద్య సేవలు చేరువ అవనున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

---

## కేసీఆర్ కుటుంబం అంతా డ్రామా ఆర్టిస్టులే

- కేటీఆర్‌కు రాజకీయంగా మెచ్యూరిటీ లేదు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శలు



**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి మరోసారి బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిన ఆయన, పదేళ్లకు పైగా మంత్రి పదవిలో ఉన్న కేటీఆర్‌కు రాజకీయంగా మెచ్యూరిటీ రాలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చేపట్టిన దీక్షలు, ఆందోళనలు అన్ని కాంగ్రెస్ పార్టీ రూపకల్పనలే అని వ్యాఖ్యానించిన ఆయన, "కేసీఆర్ జాక్‌పాట్ కొట్టాడు. కానీ మా నాయకులు మాత్రం ఆ అవకాశం వదులుకు న్నారు" అన్నారు. "అన్నం లేకుండా కేసీఆర్ ఎంతసేపు ఉండగలరు?" అని ప్రశ్నించిన జగ్గారెడ్డి, బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన కేటీఆర్ నోరు జారుతున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంలో మాట్లాడుతూ, "కేటీఆర్‌కు రాజకీయ విజ్ఞానం ఉందా? అతడి అమ్మమ్మ, తాతయ్య ఉంటే ఆయన చెంపపై కొట్టేవారు" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం మొత్తం డ్రామా ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తోందని ఆరోపించారు. "కుటుంబానికి స్పష్టమైన విలువలు లేవు" అని జగ్గారెడ్డి అన్నారు. "తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయ డం తగదు. అదే కాంగ్రెస్ పార్టీని చిల్లర పార్టీ అంటావా? నీ కుటుంబం సోనియాగాంధీ ఇంటి చుట్టూ తిరిగినప్పుడు చిల్లర పార్టీ అనిపించలేదా?" అంటూ కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణ రాష్ట్రం రావడానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కారణం. కేసీఆర్ కూడా అసెంబ్లీలో అదే విషయాన్ని స్వయంగా చెప్పారు. రాజకీయ పాఠాలు ఆయన కాంగ్రెస్ నుంచే నేర్చుకున్నారు. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ అయితే కేసీఆర్ కూడా అదే స్థాయిలో ఉన్నట్టే కదా?" అని జగ్గారెడ్డి విమర్శించారు. తెలంగాణ బిడ్డ అయిన సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వకుండా, కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడాన్ని ఆయన విమర్శించారు. "అవకాశవాద రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అంటూ కేసీఆర్, కేటీఆర్ వైఖరులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎండగట్టారు.

---

## గౌరవెల్లి ప్రాజెక్టుకు భూసేకరణ

### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** గౌరవెల్లి ప్రాజెక్టుకు భూసేకరణ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రాజెక్టులను పూర్తి చేయడం,రైతులకు న్యాయం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలో ఆయన పర్యటించారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీర్లగడ్డ తండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో భూసేకరణకు రూ.25 కోట్లు- కేటాయించి నట్లు చెప్పారు. ఎన్జీటీ కేసుకు సంబంధించి ప్రభుత్వం రూ.10 కోట్లు- చెల్లించిందని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు నీరందిస్తామని పేర్కొన్నారు. రైతులను రెచ్చగొట్టేలా భారత రాష్ట్ర సమితి వ్యవహరిస్తోందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు.

# ప్రసాజ్వామ్యంలో నిరంకుశం పనికిరాదు!



ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భావించే భారతదేశంలో ఆరోగ్యకరమైన రాజకీయ వాతావరణం లేకుండా పోతోంది. అధికారం చేపట్టిన నేతలు నిరంకుశమనే విషసంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. అన్ని వ్యవస్థలతో పాటు మీడియా పైనా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. తాము కోరుకున్నది మీడియాలో రావాలన్న అహంకారంతో ఉన్నారు. లేకుంటే మాకు వ్యతిరేకంగా మీడియా కథనాలు రాస్తోందని అక్కసు వెళ్లగక్కుతున్నారు. అలాగే మీడియా సంస్థలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. మీడియా ప్రతినిధులను దరిదాపుల్లోకి రాకుండా చూస్తున్నారు. సొంత మీడియాలను ప్రోత్సహిస్తూ..డబ్బా కొట్టుకుంటున్నారు. అహంకారం పతన హేతవు... ఇది అందరికీ తెలుసు.. కానీ మోడీ, మమతా బెనర్జీ, కెసిఆర్,జగన్ వీరంతా అహంకార పాలకులుగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు. మోడీ దేశానికి ఏమిచేయలేదని.. మోడీ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని అధికారంలో ఉండగా కెసిఆర్ తరచూ మండిపడుతూ వచ్చారు. కానీ కెసిఆర్ అంతకు మించిన అహంకారి అని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు. ఇప్పుడాయన కేవలం తను సృష్టించుకున్న ఏకాంతంలో గడుపుతున్నారు. ప్రజల్లో ఎక్కడా కానరావడం లేదు. ఆయన ఎవరినీ దరిచేరనీయరన్నది కూడా అంతే నిజం. అధికారంలో ఉండగా జనగ్ కూడా అదే తరహాలో ఐదేళ్లు అధికారం ఏలారు. జనాలను దూరంగా పెట్టారు. నిజానికి ప్రజాస్వామ్యంలో అహంకారం, నిరంకుశం పనికిరాదు. మోడీ గురించి విమర్శలు చేస్తున్న ఇండియా కూటమి నేతలు తమగతాన్ని కూడా గుర్తు చేసుకుంటే మంచింది. తమవైపు కూడా జనం చూస్తారని గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు..వారిచ్చే ఓటుతో నిరంకుశంగా కాకుండా.. ప్రజాస్వామ్య యుతంగా పాలన సాగించాలి. ఓట్లేసుకోవడం ఎలాగో తెలుసుకుని రాజ్యమేలుతున్న మన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తున్నారు. ప్రజలను పురుగుల్లా చూస్తున్నారు. పోలీసులను తమ గుప్పిట్లో పెట్టుకుని పాలన చేస్తున్నారు. ప్రజల చెంతకు రావడం, వారి గురించి తెలుసుకోవడం అన్నది మరచి పోయారు.

ఇలా జరుగుతుందని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహాశయుడు ఆనాడు ఊహించి ఉండరు. లేకుంటే ఎక్కడో ఒక దగ్గర చెక్ పాయింట్ పెట్టేవారు. ప్రజలకు చేరువగా ఉండాల్సిన నేతలు ప్రస్తుతం గిరిగీసుకుని తమ బంగళాలు దాటి రావడం లేదు. ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దేశంలో మిగతా నేతల సంగతెలా ఉన్నా... మోడీ, కెసిఆర్, జగన్‌లు అహంకారంలో తారాస్థాయికి చేరుకున్నారు. నిరంకుశంలో హిట్లర్, మోసోలీలను మించారు. మోడీని ప్రశ్నించే ముందు ఈ విషయాలను తమకు తాముగా ప్రశ్నించుకుంటే బాగుండేది. ఇకపోతే తెలంగాణలో కెసిఆర్‌కు ముందు సిఎంలుగా పనిచేసిన వారెవరూ ఎవరు కూడా ఇంత నిరంకుశంగా లేరు. దివంగత ప్రజాయుద్ధనౌక గద్దర్, కోదండరామ్ తదితర తెలంగాణ ఉద్యమకారులను కూడా కెసిఆర్ దూరం పెట్టిన విషయాన్ని జనం చూశారు. ఉమ్మడి ఏపిలో చెన్నారెడ్డి లాంటి నేత కూడా ఇంత నిరంకుశంగా పాలించ లేదు. దివంగత వైఎస్ కూడా ఎప్పుడూ ప్రజల్లో ఉండేవారు. ఇప్పుడు విభజన తరవాత అటు కెసిఆర్, ఇటు జగన్ పాలనా పగ్గాలు చేపట్టాక నిరంకుశంగా వ్యవహరించడంతో పాటు ఎదుటి పార్టీలను, వ్యక్తులను గంజిలో ఈగ తీసినట్లుగా వ్యవహరించారు. రాష్ట్రాలను అప్పులకుప్పగా తయారు చేశారు. అందుకే జనం వారిని కూడా నిరంకుశంగానే దూరం పెట్టారు. ప్రజాసంక్షేమం పేరుతో డబ్బుల పందేరంతో ఖాజానాను ఊడ్చేస్తున్న నాయకులు ఎప్పటికైనా జవాబుదారీగా ఉండాల్సిందే. అధికారంలో ఉన్న వారు నిజంగా మంచి పనులు చేస్తే ప్రజలు వారిని దూరం పెట్టరు. ప్రజలు నానా అవస్థలు పడుతున్నా వాటిపై పట్టింపు లేకుండా పాలన సాగిస్తున్నారు. ఇక బిజెపి విషయానికి వస్తే..అన్ని రాష్ట్రాల్లో పాగా వేయాలన్న సంకల్పం ఉంటే మంచిదే. అందుకు మంచి పనులు చేస్తే చాలు. ప్రజలకు ఉద్యోగ,ఉపాధి కల్పించి, జిఎస్టీ వాయింపులు లేకుండా చేసి, ధరలను అదుపులో పెట్టగలిగితే ప్రజలే నేరుగా వచ్చి ఓటేసి బిజెపిని అక్కున చేర్చుకుం టారు. అలా జరగడం లేదు కనుకనే హిమాచల్, కర్నాటకలో దెబ్బకొట్టారు. ఈ క్రమంలో మోడీ కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పాలన అంతా బ్రహ్మాండంగా ఉందన్న అహంకారంలో ప్రధాని మోడీ ఉన్నారు.

ఎంతో గొప్ప పాలన అందిస్తున్నామని చాటుకుంటున్నారు. త్వరలోనే రెండు రాష్ట్రాలలో జరుగ బోయే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ ఎన్నికలకు ముందు అయినా బిజెపిని ప్రజలకు చేరువ చేసేలా మోడీ ప్రజలకు చేరువ కావాలి. ప్రజాస్వా మ్యాన్ని, హక్కులను, న్యాయాన్ని ప్రభుత్వాన్ని, వ్యవస్థలను కాపాడుకోవాల్సి ఉంది. పాలకులు ఇది గమనించి తమపనితీరును మెరుగు పర్చుకుంటే మంచిది. అలాకాకుండా నాయకలు తమ అహంకాన్ని వీడక పోతే కాలగర్భంలో కలసిపోక తప్పదు. ప్రజలతో మంచి అనిపించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలి. కేంద్రంలో అయినా రాష్ట్రాల్లో అయినా పాలకులు నిజాయితీగా సాగాలి. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

# డికెకు సిఎం పదవి దక్కేనా?

- నివురుగప్పిన నిప్పలా అసంతృప్తి
- అంతుచిక్కని కాంగ్రెస్ తీరు



**బెంగళూరు, ఆగస్ట్ 22 :** కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై పార్టీలో అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. డికె శివకుమార్ నివురుగప్పిన నిప్పులా తన కోరికణను అణచివేసుకుని పైకి సౌమ్యుడిలా కనిపిస్తున్నారు. తను పోరాటం చేసి అధికారంలోకి తీసుకుని వస్తే సిఎం పీఠం దక్కడం లేదన్న బాధలో కుమిలిపో తున్నారు. మరోవైపు ఐదేళ్లు తనే సిఎంనని సిద్దరామయ్య భీష్మించుకున్నారు. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని ఓవైపు సిద్దరామయ్య నొక్కి చెబుతున్నా.. అటు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. తన చేతుల్లో ఏమీ లేదంటూనే 'ఆశ పడటంలో తప్పులేదు కదా' అనే సంకేతాలిస్తున్నారు. అయితే సీఎం మార్పునకు పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శివకుమార్ అసంతృప్తితో ఉన్నట్లు- తెలుస్తోంది. తాను కూడా ఎప్పటికై-నా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తానని పలుమార్లు బహిరంగంగానే చెప్పిన డీకే.. తన వ్యాఖ్యల ద్వారా ఆ పీఠంపై తనకున్న ఆశను వెలిబుచ్చుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా డీకే వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ సమావేశంలో శివకుమార్ తన రాజకీయ జీవితం గురించి మాట్లాడుతూ.. ఆరెస్సెస్‌తో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరెస్సెస్ గీతమైన 'నమస్తే సదా వత్సలే'ను ఆయన పాడడంతో భాజపా నాయకులంతా చిరునవ్వులు చిందిస్తూ, బల్లలపై చప్పట్లు- చరుస్తూ.. నినాదాలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అసెంబ్లీలో శివకుమార్ ప్రవర్తనపై నెట్టింట మ-రోమారు చర్చ మొదలైంది. తనకు సీఎం పీఠం ఇవ్వకపోతే భాజపాలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీని, సిద్ధరామయ్యను బెదిరించేందుకే ఆయన ఈవిధంగా చేసి ఉంటారని పలువురు నెటిజన్లు చర్చించు కుంటున్నారు. ఇటీవల స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాని మోదీ ఆరెస్సెస్‌ను ప్రశంసించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుపట్టిన నేపథ్యంలో శివకుమార్ పరోక్షంగా ఆయనకు పార్టీ మార్పు గురించి హెచ్చరికలు చేసి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా ఓ అంగీకారానికి వచ్చారన్న వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా తొలగించాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి.

# కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

## సుప్రీం కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ :** వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటుచేయాలని వెల్లడించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్లు చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది. దిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలంటూ ఆగస్టు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. వీటి దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ద్విసభ్య ధర్మాసనం దిల్లీలో అవి ఎక్కడా కనిపించడానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని తీర్పు చెప్పింది. ఈ ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈసందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం.. తదుపరి విచారణ ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

# వెబ్‌సిరీస్‌లో ప్రధాని మోదీ మాజీ బాడీగార్డ్



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ మాజీ బాడీగార్డ్, రా ఏజెంట్‌గా పనిచేసిన లక్కీ బిష్ట్ నటుడిగా అరంగేట్రం చేశారు. "సేన - గార్డియన్స్ ఆఫ్ ది నేషన్" వెబ్‌సిరీస్‌లో అతి థి పాత్రలో మెరిశారు. ప్రత్యేక ఆహ్వానం మేరకు తాను అందులో నటించినట్లు లక్కీ వెల్లడించారు. "నిజమైన సైనికుడిని తెరపై చూపించాలని మేకర్స్ భావించారు. నా మిలిటరీ నేపథ్యం, అనుభవం దృష్ట్యా ఆ అవకాశం ఇచ్చారు. ఈ నటన నాకు పూర్తిగా కొత్త. కానీ కొత్త అనుభవాన్ని ఇచ్చింది. నిజ జీవితంలో మన విధుల్ని మనం నిర్వర్తిస్తాం. క్షేత్రస్థాయిలో సైనికుడిగా ఉన్నప్పుడు మన భుజాలపై ఎంతో బాధ్యత ఉంటుంది. నిజమైన యుద్ధాల్లో మన త్యాగాలు, భయాలు అన్నీ ఉంటాయి. సైనికుడిగా నటించడం అంటే.. అలాంటి ఉద్వేగాలనే కెమెరా ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించాలి" అని లక్కీ బిష్ట్ మీడియాతో తన కొత్త జర్నీ గురించి వెల్లడించారు. "సేన - గార్డియన్స్ ఆఫ్ ది నేషన్ " ఎంఎక్స్ ప్లేయర్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. విక్రమ్ సింగ్ చౌహాన్ ప్రధాన పాత్రలో నటించగా.. యశ్పాల్ శర్మ, షిర్లే సేథియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులో కార్తీక్ అనే యు-వకుడు అమెరికాలో చేస్తోన్న ఉద్యోగాన్ని వదిలి భారతసైన్యంలో చేరి, దేశానికి సేవ చేస్తుంటాడు. ఈక్రమంలో ఆయన మిలిటెంట్లను ఎదుర్కొన్న తీరును దర్శకుడు అభినవ్ ఆనంద్ ఈ సిరీస్‌లో చూపించారు.

# గోదావరికి తగ్గిన వరద ఉధృతి

- భద్రాచలం వద్ద నెమ్మదించిన గోదావరి
- కృష్ణానదికి కొనసాగుతున్న ప్రవాహం

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** ఎగువన కురిసిన భారీ వర్షాలు, వస్తున్న వరదతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గురువారం రాత్రి 8 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 51.9 అడుగులు ఉండగా వరద ప్రవాహం 13.66 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. రాత్రి 11 గంటలకు నీటిమట్టం తగ్గుముఖం పట్టి 51.4 అడుగులకు చేరింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 48.6 అడుగులు ఉండగా గురువారం తెల్లవారుజామున 3 గంటలకు 49.5 అడుగులకు పెరిగింది. ఉదయం 6 గంటలకు 50.3, 9 గంటలకు 50.9, మధ్యాహ్నం 12 గంటలకు 51.4, 3 గంటలకు 51.9 అడుగులకు చేరింది. 5 గంటల పాటు- అదేస్థాయిలో నిలకడగా కొనసాగింది. రాత్రి 9 గంటలకు 51.7, 10 గంటలకు 51.5, 11 గంటలకు 51.4 అడుగులకు తగ్గింది. శుక్రవారం తెల్లవారుజాముకల్లా ఈ ప్రవాహం మరింత తగ్గినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం దుమ్ముగూడెం (సీతమ్మసాగర్)కు 13.23 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి 8.26 లక్షలు, మేడిగడ్డకు 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో రాగా.. వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. గోదావరి ఉధృతితో తెలంగాణ-ఏపీ సరిహద్దులోని అల్లూరి జిల్లా యటపాక మండలం రాయనిపేట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరింది. ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలం-చర్ల మార్గంలో కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోదావరి ఉగ్రరూపంతో ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు మండలాల్లో లోతట్టు- ప్రాంతాలు, రహదారులపైకి వరద చేరుకోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. శబరి నది ఉధృతి కారణంగా వేలేరుపాడు మండలంలోకి వరద అంతకంతకు పెరుగుతూనే ఉంది. భద్రాచలం నుంచి దిగువకు 13.60 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండటంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని గ్రామాలను వరద చుట్టుముట్టింది. కుక్కునూరు మండలంలో 1,222 కుటుంబాలు, వేలేరుపాడు మండలంలో 2,468 కుటుంబాలు ముంపు బారిన పడ్డాయి. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, భీమా, తుంగభద్ర నదులకు వరద పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 5.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు పది గేట్లు- ఎత్తి 4.20 లక్షల క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 4.32 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 26 క్రస్ట్ గేట్ల నుంచి 3.81 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రాల్లో జోరుగా ఉత్పత్తి జరుగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి పెరుగుతూనే ఉంది. జలాశయం ఇన్‌ఫ్లో 5,40,756 క్యూసెక్కులు కాగా.. ఔట్‌ఫ్లో 5,16,493 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 29,648 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 10 స్పిల్‌వే గేట్ల ద్వారా 4,21,530 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు విడుదల అవుతోంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 882.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 199.73 టీ-ఎంసీలుగా కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి భారీగా నీరు విడుదలవుతుండటంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్ జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. సాగర్‌కు 4.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో వస్తుండగా.. 26 గేట్లు- ఎత్తి..4.18 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 22 గేట్లను 10 అడుగల మేర, నాలుగు గేట్లను 13 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 3.67 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. కుడి కాల్వకు 9,019 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 6,401 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 583.20 అడుగుల నీటి మట్టం ఉంది. సాగర్ పూర్తి నీటినిల్వ సామర్థం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 292.24 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



# శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం

## 16 గేట్లు ఎత్తి నీటి విడుదల

**నిజామాబాద్:** జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 78,812 క్యూసెక్కులుగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,500 క్యూసెక్కులు, ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.8 అడుగులకు చేరుకుంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 79.65 టీఎంసీలుగా నమోదైంది.



# బెంగాల్ జైళ్లలో ఏఐ..

## కరడుగట్టిన ఖైదీలపై నిఘా

**బెంగాల్ :** జైళ్లలో నేరగాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు గమనించడానికి బెంగాల్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుంది. నేరగాళ్లపై నిఘా కోసం ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటుచేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల బెంగాల్‌లోని పరివర్తన కేంద్రాల్లో శిక్ష అనుభవిస్తున్న కరడుగట్టిన నేరగాళ్లు బయట జరిగే నేరాలకు జైళ్ల నుంచి ప్రణాళికలు వేయడం, గంజాయి అక్రమ రవాణా, బెదిరింపులు, హత్యలు వంటి నేరాలకు ప్లాన్ చేస్తుండడంతో జైలు కేంద్రాలు నేరాలకు నిలయాలుగా మారాయన్నారు. అటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించి, అడ్డుకునేందుకు వీలుగా ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. బెంగాల్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 60 పరివర్తన కేంద్రాల్లో ఇప్పటికే అత్యాధునిక కెమెరాలు ఉన్నప్పటికీ ఖైదీలు తమ దృష్టినుంచి తప్పించుకుంటున్నారని పోలీసులు పేర్కొన్నారు. అందువల్లే వాటిని ఏఐతో అనుసంధానిస్తున్నామన్నారు. ప్రతి ఖైదీ బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరుస్తామన్నారు. ఇవి సాధారణ కెమెరాల్లా రికార్డు అవడమే కాక జైలు లోపల అనుమానాస్పద కదలికలు, తగాదాలు, విధ్వంసం, తప్పించుకునే ప్రయత్నాలు వంటివాటిని గుర్తించి వెంటనే జైలు గార్డులను అప్రమత్తం చేస్తాయని తెలిపారు. ఇందులో ఉన్న ముఖ గుర్తింపు ద్వారా భోజన సమయాల్లో, హాజరు తీసుకునే సమయంలో గైర్హాజరైన వారిని, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని ట్రాక్ చేసి అధికారులను అప్రమత్తం చేస్తుందన్నారు. ముఖ్యమైన కేసుల్లో అరెస్టైన కరడుగట్టిన నేరగాళ్లు ప్రత్యేక నిఘాలో ఉంటారని తెలిపారు. అంతేకాకుండా ఏఐ ద్వారా జైళ్లలో సెల్‌ఫోన్లు, పదునైన ఆయుధాలు, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత వస్తువులను గుర్తించవచ్చని తెలిపారు. ఈ ఏఐ-ఆధారిత వీడియో విశ్లేషణలు ఖైదీల ప్రవర్తన, మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణులను కూడా అంచనా వేయగలవన్నారు. దీనివల్ల అధికారులు ముందుగానే జోక్యం చేసుకొని.. దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు.



## వసతి గృహం, పాఠశాల ఆకస్మిక తనిఖీ

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 22:** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం మణుగూరులోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల ,తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, వసతి గృహం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తరగతి గదులు, భోజనశాల, వసతి గృహాలు, పాఠశాల పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. హాస్టల్ తనిఖీ సమయంలో విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వసతి సౌకర్యాలు, పరిశుభ్రత, త్రాగునీరు, మంచం, దుప్పట్లు, స్నానాల గదులు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థుల చదువుపై ఆసక్తి, ఉపాధ్యాయుల బోధన నాణ్యత, అభ్యాస స్థాయి పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, ప్రభుత్వమందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠ్యబోధనతో పాటు పోటీ పరీక్షల శిక్షణను కూడా అందించాలని గైడ్ చేశారు. భోజనశాల పరిశీలనలో, ఆహార పదార్థాల నిల్వ, వంటశాల శుభ్రత, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను కలెక్టర్ ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. తాజా పదార్థాలతోనే వంట చేయాలని, ఆహారం పోషకాహారంతోనూ, రుచికరంగానూ ఉండేలా జాగ్రత్త పడాలని సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదు అని వసతి, భోజనం, శుభ్రత, భద్రతపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి అని ఆదేశించారు. విద్యార్థులు పుస్తకాలతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ప్రతిభ కనబరచేలా అవకాశాలు కల్పించాలన్నారు. పాఠశాలల నెలకొన్న సమస్యలపై నివేదికలు అందించాలని తక్షణమే పరిష్కారం చూద్దామని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## దుర్షేడు ఎరువుల కేంద్రం తనిఖీ

**కరీంనగర్, ఆగష్టు 22:** రైతుల కోసం ఎరువుల సరఫరా సక్రమంగా జరిగిందో లేదో పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దుర్షేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల విక్రయ కేంద్రం, గోదాము తనిఖీ చేశారు. కలెక్టర్ గోదాములో నిల్వలను, విక్రయ కేంద్రం స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి, రైతువారీగా అమ్మకాలు నమోదు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకోసం ఎరువులు విస్తీర్ణం ఆధారంగా పంపిణీ చేయాలని, ప్రతి ఏ.ఈ.ఓ విక్రయాలను ఆన్లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయమని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలో ఉన్న ఎరువులను ఏ.ఈ.ఓలు పరిశీలించి రైతులకు అందించమని సూచించారు. తనిఖీ కార్యక్రమం అనంతరం, కలెక్టర్ సంఘ భవనం ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, దుర్షేడు చైర్మన్ తోట తిరుపతి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడిఏ రణధీర్, ఏంఏవోలు సత్యం, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.



## తాగుడుతో ముడిపెట్టి అవమానం

### తహసీల్దార్ సస్పెన్షన్ కోరిన సంఘం

**కరీంనగర్ :** కొత్తపల్లి తహసీల్దార్ దురుసు ప్రవర్తనపై ప్రజల్లో ఆగ్రహం ఉప్పొంగుతోంది. ప్రజల సమస్యలపై సమాధానం ఇవ్వాల్సిన అధికారి.. అహంకారంగా, అవమానకరంగా ప్రవర్తించడంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండిపడింది. తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. దేవదాయ శాఖ భూమి విషయంలో ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు పురోగతిని తెలుసుకోవడానికి సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్ళారు. కానీ తహసీల్దార్ సూటిగా సమాధానం చెప్పకుండా, దురుసుగా మాట్లాడరని, నేతలు ఆరోపించారు. అంతేకాదు, మీరు తాగి వచ్చారా? అంటూ అటెండర్‌తో అడిగించారని, పైగా మా స్టాఫ్ తాగినట్టున్నారు. అంటూ వ్యాఖ్యానించారని, నేతలు మండిపడ్డారు. ప్రజా సేవకులు అయిన తహసీల్దార్.. అది కూడా మెజిస్ట్రేట్ హోదాలో ఉండి ఇలాంటి తీరుతో మాట్లాడడం సిగ్గుచేటు. విధి నిర్వహణలో ఉన్నవారు మద్యం తాగి ఉంటారన్న వ్యాఖ్యలతో ప్రవర్తించడం మానవ హక్కుల ఉల్లంఘన, అని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్‌పై కఠిన చర్యలు తీసుకుని వెంటనే సస్పెండ్ చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లరాజు, నాయకులు సత్యనారాయణ చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బురాన్‌పల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని

# అన్ని విధాల అభివృద్ధి చేస్తా

- మహిళలను కోటీశ్వరులుగా చేయడం ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బురాన్ పల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని బురాన్ పల్లి లో పల్లెల్లో పనుల జాతర – 2025 లో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 20 లక్షల వ్యయంతో చేపట్టే బురాన్ పల్లి గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, పిడబ్ల్యుడి రోడ్డు నుండి బురాన్ పల్లి వరకు 63 లక్షలతో చేపట్టిన నూతన బిటి రోడ్డుకు, బురాన్ పల్లి నుండి ధన్నారం వరకు 63 లక్షలతో నూతనంగా చేపట్టిన బిటి రోడ్డులకు సభాపతి ప్రారంభోత్సవం గావించారు. ఈ సందర్భంగా సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ



ముందుకు వెళుతుందన్నారు. ఇంకా ప్రజలకు ఇచ్చిన హామీలు అయిన మహాలక్ష్మి పథకం కింద ఇంటి యజమానికి 2500 ఆర్థిక సహాయం, కళ్యాణ లక్ష్మికి ఇవ్వాల్సిన తులం బంగారం త్వరలోనే చెల్లించనున్నట్లు ఆయన అన్నారు. గత ప్రభుత్వం 6 వేల కోట్ల అప్పు చేసిందని, వీటికి 6500 కోట్ల వడ్డీ చెల్లిస్తూనే ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వము ఇంటికి ఒక ఉద్యోగం, పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, ఉండడానికి ఇల్లు ఇవ్వలేక పోయిందని ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇండ్లు, రేషన్ కార్డులతో పాటు చౌకధర దుకాణాల ద్వారా ద్వారా సన్న బియ్యాన్ని సరఫరా చేయడంతో పాటుగా పెన్షన్లను కూడా అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అసైన్మెంట్ కమిటీని పునరుద్ధరించి భూములు లేని పేదలకు భూములు ఇచ్చే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ తెలిపారు. పంట పొలాలకు వెళ్లే దారులకు రోడ్లు వేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారికి స్పీకర్ సూచించారు. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని తహసిల్దార్ కు స్పీకర్ సూచించారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహించడం జరుగుతుందని అదేవిధంగా డ్వాక్రా సంఘాలకు మిత్తి లేని రుణాలను ఒక్కో సంఘానికి 10 లక్షల రూపాయల చొప్పున అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరున ఉండాలని ఉద్దేశంతో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ కింద ఉద్యానవన మొక్కలు నాటేందుకు ప్రొసీడింగ్ కాపీలను స్పీకర్ చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డి ఆర్ డి ఓ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఎంపిడిఓ వినయ్ కుమార్, పంచాయత్ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్టిఏ సభ్యులు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## లోతుకుంట ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో

# వార్డెన్ పోస్ట్ భర్తీ చేయాలి

- హాస్టల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ హాస్టల్లలో ఎస్ఓ లను మార్చాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు



**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ ఆదర్శ పాఠశాలల్లోని బాలికల వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ హాస్టల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు హాస్టల్లో వార్డెన్ లేక సమస్యలు చెప్పుకోవడానికి ఎస్ ఓ రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు అదేవిధంగా హాస్టల్లో కరెంటు సౌకర్యం లేక చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతున్నాయి అన్నారు మండలంలో ఉన్న మండల అధికారులు పర్యటనకు వస్తావున్నారు పోతావున్నారు కానీ సమస్యలు మాత్రం అలాగే మిగిలిపోయిన పరిస్థితి ఉందన్నారు హాస్టల్లో కనీసం మిక్సీ గ్రైండర్ వాటర్ సౌకర్యం చుట్టూ పక్కల పరిశుభ్రత లేకుండా అక్కడ ఉండాల్సిన కేర్ లేకుండా నానా రకాలుగా విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వలిగొండ మోడల్ స్కూల్ ను గాలికి వదిలేసిన పరిస్థితి ఉందన్నారు బాధ్యులుగా ఉన్న ఎస్ఓ హాస్టల్ కి వచ్చిన దుస్థితి లేదన్నారు గత సంవత్సరంలో వచ్చిన విద్యార్థులు ఈ సంవత్సరంలో వచ్చిన విద్యార్థులు ఇప్పటికి ఎవరు ఒక్కసారి ఎస్ఓ ను చూసిన పాపమే లేదన్నారు వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వలిగొండ లోతుకుంట హాస్టల్ సందర్శించాలన్నారు హాస్టల్ సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్న ఎస్ఓపై చర్యలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మైసొల్ల నరేందర్, నాయకులు సాయి వినయ్, ఫాతిమా, భవాని, చందు తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.



## హౌసింగ్ బోర్డు కాలనీ స్థలాలను ప్రజావసరాల కోసం ఉపయోగించాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి నియోజకవర్గం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఖాళీ స్థలాలను విక్రయించవద్దని స్థానికంగా ప్రజల అవసరాలకు కేటాయించాలని కోరుతూ హౌసింగ్ బోర్డు వీసీ గౌతమ్ ను శుక్రవారం ఆయన ఛాంబర్ లో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్ ను ఆధునిక హంగులతో నిర్మించాలని, మహిళా పార్కు వద్ద జేఎన్టీయూ హైటెక్ సిటీ రోడ్డులోని ఖాళీ స్థలాన్ని పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం కేటాయించాలని, సిద్ధి వినకాయక స్వామి ఆలయానికి అనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని, అదేవిధంగా చర్చ్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, ఖైత్లాపూర్ వద్ద స్థానిక గ్రామస్థుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, మహిళలు, సీనియర్ సిటిజన్స్ భవనాల కు స్థలం కేటాయించాలని కోరుతూ పలు వినతి పత్రాలను అందజేశారు. ఈ మేరకు హౌసింగ్ బోర్డు వీసీ స్పందించి కాలనీలో అందుబాటులో ఉన్న స్థలాల వివ రాలను పరిశీలించి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## రోడ్డు విస్తరణ లోపాలపై చర్యలు తీసుకోవాలి

- భీమలింగం కాల్వ ద్వారా చివరి వరకు సాగునీరు అందించాలి
- సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్



**యాదాద్రి భువనగిరి జిల్లా రాజముద్ర న్యూస్:** ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కి సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్ వినతిపత్రం అందజేసి ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలోని జాతీయ రహదారి 930టి కి వలిగొండ నుండి తొర్రూరు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులలో నాణ్యత లేకుండా రోడ్డు పనులు జరుగుతున్నాయి డ్రైనేజీ, రోడ్డుకు ఇరువైపులు ఉన్న బావులకు సైడ్ వాళ్ళు లేనందున ప్రమాదాలకు అంచున ఉన్నాయి అలాగే గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా జాలీలు నిర్మించడం వల్ల గ్రామంలోని ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వెంటనే హై బ్రిడ్జిలు ఏర్పాటు చేయించేలా, నాణ్యత లోపాల పైన ప్రభుత్వం వి.డి.బి కన్స్ట్రక్షన్ పైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులను కోరారు. ప్రధానంగా భీమలింగం కాల్వ గత 30 సంవత్సరాలుగా అనేక సమస్యలతోనే పూర్తికాలేక చివరి వరకు సాగునీరు అందడం లేదు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన భీమలింగం మరమ్మత్తులు చేపట్టి షట్టర్లు, సిసి నిర్మాణం చేపట్టి చివరివరకి సాగునీరు అందించి ఈ ప్రాంత రైతంగాన్ని ఆదుకోవాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణలో యువత కీలకపాత్ర




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** పర్యావరణ పరిరక్షణలో యువత కీలకపాత్ర పోషించాలని యూత్ గేమిఫికేషన్ క్లబ్ అధ్యక్షురాలు సిరి ఉపాధ్యక్షుడు సార్థక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వివిధ వివిధ పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచాన్ని ప్లాస్టిక్ మహమ్మారి పట్టిపీడిస్తున్నదని అన్నారు పర్యావరణ విద్యను సరదాగా నేర్చుకోవాలని సూచించారు కొన్ని సంవత్సరాల నుండి తాము వివిధ పాఠశాలలలో ఔట్రిచ్ ఈవెంట్లను నిర్వహిస్తున్నామని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంపై ఆచరణాత్మక చిట్కాలను విద్యార్థులు పాటించాలని సూచించారు. జంతువులు ప్లాస్టిక్ కవర్లను తినడం వల్ల జీర్ణశక్తి సమస్యలతో చనిపోతున్నాయని పేర్కొన్నారు ప్రతి స్కూలులో రీసైక్లింగ్ డబ్బాలను విరాళంగా అందజేస్తున్నామని ప్రతి విద్యార్థి తమ ప్లాస్టిక్ డబ్బాలో వేయాలని కోరారు.

## సుంకిశాలలో పనుల జాతర కార్యక్రమం



**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండలంలోని సుంకిశాల గ్రామంలో పనుల జాతర కార్యక్రమం గ్రామ సెక్రెటరీ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మత్స్యగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈతాప రాములు, చెరుకు శివయ్య గౌడ్ మాజీ సర్పంచ్ మొగిలిపాక నరసింహ, గ్రామ పెద్దలు తుమ్మల సత్తిరెడ్డి, కొండే కిష్టయ్య రాచమల్ల శంకరయ్య పోలేపల్లి బాలకృష్ణ మొగిలి పాక ఎల్ల స్వామి,ఎడవెల్లి రాములు ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య అంగన్వాడి టీచర్ కలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డికి భారత నౌకాదళం నుండి ప్రశంసా పత్రం

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి చేసిన విశేష సేవలకు గాను భారత నౌకాదళం నుండి ప్రశంసా పత్రం లభించింది. భారత నౌకాదళ ఉప అధిపతి, వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి ఈ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఎస్పీ కె. నారాయణ రెడ్డి విధి నిర్వహణలో చూపించిన అంకితభావం, నిబద్ధత, వృత్తి నైపుణ్యానికి ఈ ప్రశంస లభించింది. ఈ గౌరవం పొందడం పట్ల కె. నారాయణ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కూడ పాల్గొనడం జరిగింది.



## క్షామంలో కూరుకుపోయిన గాజా : ఐరాస

**గాజా :** నిత్యం దాడులతో దద్దరిల్లుతోన్న గాజా క్షామంలో కూరుకుపోయింది. ఈ విషయాన్ని ఐరాస శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఐదు లక్షలమంది ప్రజలు ఆకలిమంటల్లో కాలిపోతున్నారని, పశ్చిమాసియాలో ఈ స్థాయి దుర్భిక్ష పరిస్థితులు కనిపించడం ఇదే తొలిసారని పేర్కొంది. "ఈ క్షామాన్ని పూర్తిగా నివారించవచ్చు. ఇజ్రాయెల్ దశలవారీగా అడ్డంకులు సృష్టిస్తుండటంతో ఆహారం ఇక్కడ ప్రజలకు చేరడం సాధ్యంకావడం లేదు" అని యూఎన్ ఎయిడ్ చీఫ్ టామ్ ఫ్లెట్చర్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. అయితే ఈ వ్యాఖ్యలను ఇజ్రాయెల్ ఖండించింది. ఇది స్వార్థ ప్రయోజనాలతో కూడిన నివేదిక అని మండిపడింది. కాగా.. గాజాలో మానవతా పరిస్థితులు రోజురోజుకూ దిగజారిపోతున్నాయని ఐరాస కొంతకాలంగా హెచ్చరిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జులై ఒకటి నుంచి ఆగస్టు 15 వరకు సేకరించిన సమాచారం ఆధారంగా క్షామం గురించి తాజాగా ప్రకటన చేసినట్లు పేర్కొంది. సెప్టెంబర్ నాటికి ఆకలితో అలమటించేవారి సంఖ్య 6,41,000కు చేరొచ్చని తెలిపింది. మరోవైపు.. హమాస్ ఆయుధాలు విడిచిపెట్టకపోతే గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయెల్ మరోసారి హెచ్చరించింది. హమాస్ తమ దారికి రాకపోతే గాజా విధ్వంసం తప్పదని, వారికి నరకదారులు తెరుచుకుంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వ్యాఖ్యానించారు. వెంటనే తమ బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికకు ఆమోదం తెలిపిన ప్రధాని నెతన్యాహు.. ఇందుకోసం మరో ఆపరేషన్ చేపడతామన్నారు. హమాస్ ను అంతం చేయడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.



## విదేశీ పర్యాటకులకు థాయ్ బంపర్ ఆఫర్

### దేశీయ విమాన ప్రయాణం ఫ్రీ

**థాయ్‌లాండ్ :** భారతీయులతో సహా విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు థాయ్‌లాండ్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. తమ దేశంలోని పర్యాటక ప్రదేశాలు ఆదరణ పొందేందుకు కొత్త ట్రావెల్ స్కీమ్ ప్రవేశపెట్టనుంది. దీని కింద దేశీయ విమాన ప్రయాణాన్ని ఫ్రీగా కల్పించనుంది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్, బ్యాంకాక్ వంటి ప్రదేశాలకు మాత్రమే విదేశీ పర్యాటకులు ఎక్కువగా వెళ్తున్నారని గ్రహించిన ప్రభుత్వం.. వారు మిగిలిన ప్రదేశాలు కూడా చూసేలా తమ దేశంలో విమాన ప్రయాణం ఉచితం చేయాలని చూస్తోంది. "బై ఇంటర్నేషనల్, ఫ్రీ థాయ్‌లాండ్ డొమెస్టిక్ ఫ్లైట్స్" పేరిట ఆ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ప్లాన్ కింద దేశీయ విమానాల్లో ప్రయాణించేవారికి వన్‌వే టికెట్ ధర 1,750 బాత్, రౌండ్ ట్రిప్స్ అయితే 3,500 బాత్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని యోచిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ మధ్యలో ఈ ప్రొగ్రామ్ అందుబాటులో ఉండొచ్చని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. థాయ్‌లాండ్‌కు స్టాండర్డ్ ఇంటర్నేషనల్ టికెట్స్ తీసుకున్న ప్రయాణికులు ఎయిర్‌లైన్ వెబ్‌సైట్స్, మల్టీ సిటీ ఆప్షన్స్, ఫ్లైత్రూ సర్వీసెస్, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెంట్స్ వద్ద ఈ ఆఫర్‌ను పొందొచ్చు. ప్రతి ప్రయాణికుడు రెండు దేశీయ విమాన టికెట్లు పొందడానికి వీలుంటుంది. 20 కేజీల బ్యాగేజీని అనుమతిస్తారు. ఈ ప్రాజెక్ట్ కింద రెండు లక్షలమంది అంతర్జాతీయ పర్యాటకులను రప్పించాలన్నదే థాయ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల అన్ని రకాలుగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 21.80 బిలియన్ బాత్ మేర ప్రయోజనం కలగనుందని అంచనా. అందుకోసం ఆ దేశ టూరిజం అథారిటీ.. ఆరు దేశీయ విమానయాన సంస్థలతో పనిచేయనుంది.



## 'ఆ నిర్బంధ కేంద్రాన్ని మూసివేయండి'..

### ట్రంప్ ప్రభుత్వానికి కోర్టులో చుక్కెదురు

**యూఎస్ :** ఓ నిర్బంధ కేంద్రానికి సంబంధించి ట్రంప్ ప్రభుత్వానికి కోర్టులో చుక్కెదురు అయ్యింది. ఫ్లోరిడాలో ఉన్న ఆ నిర్బంధ శిబిరంలోకి కొత్తగా ఏ వలసదారుడినీ తరలించవద్దని ఓ ఫెడరల్ కోర్టు ఆదేశించింది. అంతేకాదు ఆ కేంద్రంలోని చాలా భాగాన్ని కూల్చివేయాలని, పూర్తిస్థాయిలో దానిని మూసివేయాలని స్పష్టం చేసింది. అయితే, ఈ ఆదేశాలపై స్పందించిన ఫ్లోరిడా ప్రభుత్వం.. అప్పీలుకు వెళ్తామని ప్రకటించింది. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ యంత్రాంగం ఫ్లోరిడాలోని ఎవర్‌గ్లేడ్స్‌లో నిర్బంధ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దాదాపు 3వేల మందిని ఉంచేందుకు వీలుగా టెంట్లు, వైరు బోనులు, బెడ్లు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాన్ని ఇటీవల తనిఖీ చేసిన అధ్యక్షుడు ట్రంప్.. ఈ ప్రాంతంలో ఉండే ప్రాణాంతక జీవాలు కాపలాదారుగా పని చేస్తాయంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అందుకే ఈ కేంద్రానికి 'ఎలిగేటర్ అల్కట్రాజ్' అని వైట్‌హౌస్ పేరు పెట్టడం గమనార్హం. ఈ నిర్బంధ కేంద్రంపై పర్యావరణవేత్తలు, ట్రంప్ వలసవాద కార్యాచరణను వ్యతిరేకించే వారినుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అమానవీయ కేంద్రంగా పేర్కొంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఇది పర్యావరణ వ్యవస్థను దెబ్బతీస్తుందని, ప్రభావాలను అంచనా వేయకుండా దీన్ని నిర్మించారని పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో దీనికి సంబంధించిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అక్కడ తాత్కాలికంగా నిర్మించిన ఫెన్సింగ్, జనరేటర్లు, చెత్త, మురుగు నిర్వహణ వ్యవస్థలను 60 రోజుల్లోగా తొలగించాలని ఆదేశించింది. నిర్బంధించేందుకు కొత్త వ్యక్తులనూ ఇక్కడికి తీసుకురావద్దని స్పష్టం చేసింది.

### 50 గంటల అరెస్ట్‌తో ఉద్యోగాలే పోతుంటే..

# పీఎం, సీఎంలకు ఊరటా?

### ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** తప్పు చేస్తే సీఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఉంటే జైల్లో.. లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు.. జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ ప్రశ్నించారు. బిహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. "కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే.. ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగలుగుతాం?" అని మోదీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని.. ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

# పార్లమెంట్ వద్ద భద్రతా ఉల్లంఘన

### గోడ దూకి లోపలికి వెళ్లిన చొరబాటుదారుడు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలో పార్లమెంట్ భవనం వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన చోటుచేసుకుంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆ ప్రాంతంలో ఒక చొరబాటుదారుడు చెట్టు ఎక్కి, గోడ దూకి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు భవన్ వైపు నుంచి గోడ దూకి కొత్త పార్లమెంట్ భవనానికి చెందిన గరుడ గేట్ వద్దకు చేరుకున్నాడని అధికారులు తెలిపారు. ఆ చొరబాటుదారుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటిరోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. జులై 21న ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి 2023లో పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగి 22 ఏళ్లు అయిన డిసెంబరు 13న ఆ ఘటన చోటుచేసుకోవడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న ఇద్దరు యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వదిలి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదేరకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. గతేడాది ఆగస్టులో కూడా ఈతరహా ఉల్లంఘన చోటుచేసుకుంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు గుర్తించారు. అప్పుడు ఆ నిందితుడి వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు.

**ఉత్తర్‌ప్రదేశ్ వ్యక్తిగా గుర్తింపు..**

తాజా ఘటనలో పేర్కొన్న నిందితుడిది ఉత్తర్‌ప్రదేశ్. అతడి పేరు రామా అని అధికారులు వెల్లడించారు. 20 ఏళ్ల ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగాలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అతడు ఏ ఉద్దేశంతో ఇలాంటి చర్యకు పాల్పడ్డాడో తెలుసుకునేందుకు ఐబీ, దిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం అతడిని ప్రశ్నిస్తోంది.

### అమెరికా-భారత్ సంబంధాలపై

# 'పెట్రోల్' చల్లుతున్న ట్రంప్ భక్తుడు



**యూఎస్ :** భారత్-అమెరికా బంధాన్ని ట్రంప్ వీరభక్తుడొకరు విచ్ఛిన్నం చేస్తున్నారు. తరచూ నోటికొచ్చిన ప్రకటనలు చేస్తూ ఇప్పటికే ఉన్న వివాదాలపై 'పెట్రోల్' చిలకరిస్తున్నారు. ఇరుదేశాల మధ్య బంధాన్ని నిర్మించడానికి గత అధ్యక్షులు చేసిన ప్రయత్నాలను బూడిదపాలు చేస్తున్నారు. స్వయంగా రిపబ్లికన్ మద్దతుదారులు.. ట్రంప్ వర్గీయులు నెత్తీనోరు బాదుకొంటున్నా.. ట్రంప్ అతడికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. దీంతో ఈ భక్తుడు ఆగడం లేదు.. అతడి పేరు పీటర్ నవారో. గతంలో ట్రంప్ కోసం ఏకంగా నాలుగు నెలలు అమెరికా జైల్లో గడిపి శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. ట్రంప్ వాణిజ్యయుద్ధం వెనక వ్యూహం అతడిదే అని చాలామంది నమ్ముతారు..! ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపట్టాక 75 ఏళ్ల ఆర్థికవేత్త పీటర్ నవారోను తన వాణిజ్య సలహాదారుగా ట్రంప్ శ్వేతసౌధంలోకి తీసుకొచ్చారు. అతడి నేపథ్యం తెలిసిన చాలామంది అతడి నియామకాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

**రిపబ్లికన్‌గా మారిన డెమోక్రట్..**

1970ల్లో నవారో జాతీయవాది కాదు. అతడు ఓ డెమోక్రటిక్ సానుభూతిపరుడు. వియత్నాం యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, పర్యావరణ పరిరక్షణను కోరుతూ కాలిఫోర్నియాలో ఉద్యమించారు. ఆయన హార్వర్డు విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. ఇక శాన్‌డియా మేయర్, కాంగ్రెస్ ఇలా పలు పదవులకు పోటీ చేసి ఓడిపోయారు. యూజీఐలో ఎకనామిక్స్, పబ్లిక్ పాలసీలో ప్రొఫెసర్‌గా చేశారు. 1990ల్లో ఆయన తన వైఖరి మెల్లగా సంప్రదాయ జాతీయవాదం వైపు మళ్లింది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని వ్యతిరేకించడం, అమెరికా లో రక్షణాత్మక వాణిజ్య విధానాలు వంటి అంశాల్ని సమర్థించేవారు. 2011లో 'డెత్ బై చైనా' అనే పుస్తకం రాశారు. దానినే డాక్యుమెంటరీగా చిత్రీకరించారు. 2016లో ట్రంప్‌నకు అల్లుడు జరేడ్ కుష్నెర్ ద్వారా పరిచయం అయ్యాడు. తొలి కార్యవర్గంలో కూడా వైట్‌హౌస్ నేషనల్ ట్రేడ్ కౌన్సిల్ డైరెక్టర్‌గా పనిచేశారు. అప్పట్లో చైనాపై వాణిజ్యయుద్ధం, కొవిడ్ సమయంలో పాలసీ, 2020 ఎన్నికల ఫలితాల తర్వాత 'క్యాపిటల్ హిల్స్' ఘటనలో నవారో ప్రమేయం ఉందంటారు. 2020 అల్లర్ల విషయంలో 2023లో ఆయన్ను అమెరికా కాంగ్రెస్ విచారణకు పిలిస్తే వెళ్లకపోవడంతో నాలుగు నెలల పాటు జైల్లో వేశారు. దీంతో ఆయనకు ట్రంప్ వీరభక్తుడిగా ముద్ర పడింది.

**నోటి దురుసుతో మస్క్‌నే వెళ్లగొట్టిన ఘనుడు**

2024లో అమెరికా ఎన్నికలు ముగిసేనాటికి ట్రంప్-మస్క్‌ల మధ్య స్నేహం విపరీతంగా పెరిగిపోయింది. ఓ రకంగా టెస్లా అధినేతే షాడో ప్రెసిడెంట్ అనేవారు. కానీ, వాణిజ్యంలో నవారో సూచించే రక్షణాత్మక వైఖరి, టారిఫ్ యుద్ధం ఆయనకు నచ్చేది కాదు. టెస్లా విడిభాగాలు విదేశాల్లో తయారై అమెరికాకు వస్తే వాటిని ఇక్కడ అసెంబ్లింగ్ చేస్తున్నారని మస్క్‌ను దెప్పిపొడిచారు. ఓ దశలో 'కార్ అసెంబ్లర్' అని వ్యాఖ్యానించారు. ఓసారి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలోనే మస్క్-నవారో తీవ్రంగా గొడవపడ్డారన్న వార్త గుప్పుమంది. నవారో 'మూరుడు' అంటూ మస్క్ బహిరంగానే పోస్టు పెట్టారు. ట్రంప్ నవారో పక్షాన ఉన్నట్లు అనిపించిన తర్వాత నుంచే మస్క్ మెల్లగా శ్వేతసౌధం నుంచి దూరమయ్యారు. ఇప్పుడు ట్రంప్-మస్క్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేటట్లుంది. ట్రంప్ కార్యవర్గంలో వారితో నవారో గొడవపడటం ఇదే తొలిసారి కాదు, 2018లో నాటి ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్‌తో కూడా ఓ చైనా ప్రభుత్వ కార్యాలయ భవనం లాన్‌లో బహిరంగానే గొడవ పడ్డారు. అంతేకాదు.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు నరకంలో ప్రత్యేక స్థానం ఉంటుందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసి క్షమాపణలు చెప్పారు.

**రెండోసారి అరాచకమే..**

రెండోసారి ట్రంప్ కార్యవర్గంలో సలహాదారుగా పదవి దక్కాక అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకం వెనక నవారోనే ఉన్నారు. ఇక భారత్‌పై ఆంక్షల విషయంలో ట్రంప్‌నకు మద్దతుగా నవారో స్వామిభక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ యుద్ధం ఆగితే నోబెల్ బహుమతి వస్తుందని ట్రంప్ విశ్వసిస్తుండటంతో.. రష్యా-ఉక్రెయిన్ పోరు ఆపాలంటే భారత్ చమురు కొనుగోళ్లు నిలిచిపోవాల్సిందేనని విచిత్రవాదన తెర పైకి తెచ్చారు. న్యూదిల్లీతో సంబంధాలను దెబ్బతీస్తే.. అమెరికా రక్షణ లక్ష్యాలకు పెనుముప్పు అని నిక్కీహేలీ వంటి వారు నెత్తీనోరు బాదుకొంటున్నా ఈ నవారో ఆగడం లేదు. భారత్ కంటే ఎక్కువ చమురు చైనా, అధిక సీఎన్‌జీ ఐరోపా దేశాలు కొనుగోలు చేస్తున్నా నవారో నోరు మెదపడం లేదు. రష్యా ఆంక్షల చమురును భారత్ మారు బేరానికి విక్రయించి లబ్ధి పొందుతోందని అక్కసు ప్రదర్శిస్తున్నారు. కొన్నేళ్లతరబడి భారత్-అమెరికా నేతలు ఓర్పుతో నిర్మించిన వ్యూహాత్మక బంధంపై 'రష్యా చమురు'ను నవారో చిలకరిస్తున్నారు.

## దారికి రాకుంటే.. నరకానికి ద్వారాలే

### హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక



**ఇజ్రాయెల్ :** హమాస్ ఆయుధాలు విడిచిపెట్టకపోతే గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయెల్ మరోసారి హెచ్చరించింది. హమాస్ మా దారికి రాకపోతే గాజా విధ్వంసం తప్పదని, వారికి నరకదారులు తెరుచుకుంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వ్యాఖ్యానించారు. వెంటనే తమ బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "హమాస్ ఆయుధాలు వదిలిపెట్టి, బందీలందర్నీ విడుదల చేసి, యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్ షరతులకు అంగీరించాలి. లేదంటే త్వరలోనే వారికి నరకానికి ద్వారాలు తెరచుకుంటాయి" అని ఇజ్రాయెల్ మంత్రి పేర్కొన్నారు. ఇందుకు అంగీకరించకుంటే గాజా నగరం మరో రఫా, బీట్ హనౌన్‌గా మారిపోతుందని హెచ్చరించారు. గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికకు ఆమోదం తెలిపిన ప్రధాని నెతన్యాహు.. ఇందుకోసం మరో ఆపరేషన్ చేపడతామన్నారు. హమాస్‌ను అంతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన.. యుద్ధం ముగించి, బందీల విడుదల కోసం చర్చలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి మరోసారి స్పందించారు. మరోవైపు గాజాపై మరో దశ దాడులు చేస్తామని చెబుతోన్న ఇజ్రాయెల్.. రానున్న రోజుల్లో 60 వేల మంది రిజర్విస్టులను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2 లక్షలకు చేరుకుంటుందని అంచనా.

## డ్రేక్ పాసేజ్‌లో భారీ భూకంపం..

### సునామీ హెచ్చరికలు జారీ



**యూఎస్ :** దక్షిణ అమెరికాను శుక్రవారం భూకంపం వణికించింది. డ్రేక్ పాసేజ్‌లో ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.5గా నమోదైంది. భూ ఉపరితలానికి 11 కి.మీ. లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించామని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ఈ ప్రకంపనల కారణంగా సునామీ ముప్పు పొంచిఉండటంతో చిలీ దేశం అప్రమత్తమైంది. సునామీ హెచ్చరికలు జారీ చేసిందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. దక్షిణ అమెరికా, అంటార్కిటికా మధ్య ఈ డ్రేక్ పాసేజ్ (జలవనరు) ఉంటుంది. ఇటీవల రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. రిక్టర్ స్కేల్‌పై 8.8గా తీవ్రత నమోదైంది. ఈ భారీ భూప్రకంపనల ధాటికి రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. పసిఫిక్ ప్రాంతంలో 2011 తర్వాత ఇదే అత్యంత భారీ భూకంపమని నిపుణులు పేర్కొన్నారు.

## రాజకీయ పార్టీల తీరుపై సుప్రీం ఆశ్చర్యం



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై సుప్రీం కోర్టు లోని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి బెంచ్ విచారణ చేపట్టింది. డిలీట్ చేసిన ఓటర్ పేర్లను సరిదిద్దే విషయంలో రాజకీయ పార్టీలు అచేతనంగా ఉండటంపై న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు చొరవతో ముందుకు రావాలని కోరింది. అదే సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్ ఫ్రెండ్లీగా ఉండాలని పునరుద్ఘాటించింది. "డిలీట్ చేసిన పేర్ల విషయంలో ఆధార్ కార్డు లేదా.. ఏదైనా ఆమోదయోగ్య పత్రంతో పాటు చేసే ఆన్‌లైన్ సబ్మిషన్లను అనుమతిస్తాం" అని న్యాయస్థానం పేర్కొంది. పేర్ల తొలగింపులపై భారీ సంఖ్యలో ప్రజల నుంచి స్పందన వస్తే దరఖాస్తు సమర్పణల తుది గడువును ఎందుకు పొడిగించకూడదని జస్టిస్ కాంత్ ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ప్రశ్నించారు. మరోవైపు ఈ ప్రక్రియలో బిహార్ రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములై తమ బూత్ స్థాయి ఏజెంట్లతో ఓటర్లకు సాయం చేయాలని కోర్టు పేర్కొంది. సూచించిన 11 పత్రాలు లేదా ఆధార్ ఏదైన ఒక దానిని సమర్పించి.. పేరు తొలగింపుపై అభ్యంతరాలు తెలియజేస్తూ.. పేరు తిరిగి చేర్చాలనే దరఖాస్తు ఇవ్వాలని వెల్లడించింది. అదే సమయంలో రాజకీయ పార్టీల మధ్య వివాదాలకు ఓటర్లకు లంకె పెట్టకూడదని జస్టిస్ కాంత్ సూచిం చారు. బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో తీవ్ర స్థాయిలో అవకతవకలు జరిగాయంటూ దుమారం రేగింది. దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఇప్పటికే ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే అరెస్టు



**శ్రీలంక :** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను శుక్రవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆయనపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకొన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసు అధికారులు ధ్రువీకరించినట్లు ఓ అంతర్జాతీయ వార్త సంస్థ పేర్కొంది. ప్రస్తుతం విక్రమ సింఘే కొలంబో సీఐడీ ఆధీనంలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయనకు సమన్లు అందజేసి విచారణ కూడా చేపట్టారు. 2023 సెప్టెంబర్‌లో విక్రమ సింఘే లండన్‌లో పర్యటించారు. తన భార్యతో కలిసి ఓ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆ విస్తృత విదేశీ పర్యటన అధికారంగా చేపట్టింది కాదని తర్వాత ప్రకటించారు. కానీ, దానికి ప్రభుత్వ నిధులను వినియోగించారు. హవానాలో జీ-77 సదస్సులో హాజరై తిరిగి వస్తూ లండన్‌కు వెళ్లినప్పుడు తన భార్య ఖర్చులను ఆమే పెట్టుకుందని.. ప్రభుత్వ నిధులను వినియోగించలేదని విక్రమసింఘే వాదిస్తు న్నారు. కానీ, సీఐడీ మాత్రం ఆ పర్యటనలో ప్రభుత్వ సొమ్మునే వాడారని.. దీంతోపాటు ఆయన అంగరక్షకులకు కూడా చెల్లింపులు చేశారని చెబుతోంది. ఇక ఆయన్ను ఫైనాన్షియల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ విచారించి.. కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చింది. రణిల్ విక్రమసింఘే 2022లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి వరకు పదవిలో ఉన్న గొటబయ రాజపక్సె వైదలగడంతో ఈ బాధ్యతలను స్వీకరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించారన్న పేరును ఆయన సంపాదించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు.

## ఏజీఆర్ ఊరట వార్తలు..
# దూసుకెళ్లిన వొడాఫోన్ షేర్లు




ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా షేర్లు శుక్రవారం 9 శాతం దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో షేరు విలువ బీఎస్ఈలో రూ.7.29 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 7.77 శాతం లాభంతో 7.07 వద్ద స్థిరపడింది. సవరించిన స్థూల ఆదాయం బకాయిలపై ప్రధానమంత్రి కార్యాలయం సమగ్ర సహాయ ప్యాకేజీపై చర్చించనుందన్న వార్తల నేపథ్యంలో షేర్లు పుంజుకున్నాయి. ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన కంపెనీకి ప్రభుత్వం ఊరటనిచ్చే అవకాశం ఉందని పలు ఆంగ్ల వెబ్‌సైట్లలో కథనాలు వచ్చిన నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేర్లు రాణించాయి. వొడాఫోన్ ఐడియాను ఒడ్డున పడేసేందుకు టెలికాం విభాగం ప్రధానమంత్రి కార్యాలయానికి నివేదించిందని పేర్కొందని తెలిసింది. ఈ బెయిలవుట్ కోసం పలు ఆప్షన్లను ముందు ఉంచింది. ప్రస్తుతం అమల్లో ఉన్న గడువు వాయిదాను మరో రెండేళ్లపాటు పొడిగించడం, బకాయిల చెల్లింపులకు మరింత గడువు, ఏడాదికి చెల్లించాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్లను తగ్గించడం, జరిమానాలు, వడ్డీల్లో సడలింపులు ఇవ్వడం వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం. ఏజీఆర్ బకాయిల రూపంలో వొడాఫోన్ ఐడియా సుమారు రూ.83,400 కోట్ల భారం ఎదుర్కొంటోంది. ఇప్పటికే కొంత బకాయిలను ఈక్విటీగా మార్చుకుంది. అయినప్పటికీ పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ సహకారం కోరింది. ఈ నేపథ్యంలో ప్రధాని కార్యాలయం ప్యాకేజీ అంశాన్ని పరిశీలిస్తోందన్న వార్తలు వొడాఫోన్ ఐడియా షేర్లకు ఊపిరిపోశాయి.






## నిలిచిన రియల్ మనీ గేమింగ్..
# విత్‌డ్రా మాటేంటి?

**న్యూఢిల్లీ:** నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను అడ్డుకొనేందుకు కేంద్రం తీసుకొచ్చిన గేమింగ్ బిల్లుతో ఆయా సంస్థలు రియల్ మనీ గేమ్‌లను నిలిపివేశాయి. ఈ బిల్లు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందగా.. రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారింది. అయితే.. చట్టంగా రూపాంతరం చెందకముందే వింజో, నజారా టెక్నాలజీస్ వంటి ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్ రియల్ మనీ గేమ్స్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో పోకర్‌బాజీ పేరిట ఆన్‌లైన్ గేములు నిర్వహించే మూన్‌షైన్ టెక్నాలజీస్ తన కార్యకలాపాలు నిలిపివేసింది. ఈ విషయాన్ని దాని అనుబంధ సంస్థ నజారా టెక్నాలజీస్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. వెబ్‌సైట్‌లోనూ ఆ విషయాన్ని పొందుపరిచింది. ఇప్పటికే వాలెట్‌లో సొమ్ములున్నవారికి విత్‌డ్రాకు అనుమతిస్తామని పేర్కొంది.

- రమ్మీ, సాలిటైర్, దెహ్లాపకడ్, ఫాంటసీ క్రికెట్, పోకర్ వంటి రియల్ మనీ గేమింగ్ అందించే వింజో సైతం రియల్‌మనీ గేమ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దేశ చట్టాలకు లోబడి తక్షణమే ఆన్‌లైన్ రియల్‌మనీ గేమ్‌లను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించింది.
- మొబైల్ ప్రీమియర్ లీగ్ కూడా రియల్‌మనీ గేమ్స్‌ను నిలిపివేసింది. భారత్‌లో ఎంపీఎల్ వేదికగా ఉన్న అన్ని గేమ్‌లను తక్షణమే తొలగిస్తున్నామని తెలిపింది. కొత్తగా డిపాజిట్లు స్వీకరించడం లేదని, కస్టమర్లు తమ బ్యాలెన్స్‌ను సులువుగా ఉపసంహరించుకోవచ్చని పేర్కొంది. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఇకపై ఎంపీఎల్ ప్లాట్‌ఫామ్‌పై లభించబోవని స్పష్టంచేసింది. భారత్ సహా ఆసియా, యూరప్, ఉత్తర అమెరికాలో ఎంపీఎల్‌కు 120 మిలియన్ రిజిస్టర్డ్ యూజర్లు ఉన్నారు.
- మరో గేమింగ్ ప్లాట్‌ఫామ్ జూపీ సైతం అన్ని పెయిడ్ గేమ్స్‌ను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. లూడో సుప్రీమ్, లూడో టర్బో, స్నేక్స్ అండ్ లేడర్స్, ట్రంప్ కార్డ్ మేనియా వంటి ఫ్రీ గేమ్స్ మాత్రం కొనసాగుతాయని స్పష్టంచేసింది.
- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు కారణంగా క్యాష్ గేమ్స్, కాంటెస్టులను నిలిపివేసినట్లు డ్రీమ్ 11 కూడా తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

### గేమింగ్ బిల్లుపై మిశ్రమ స్పందన

ఇండియా గేమింగ్ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ గేమ్ యూజర్లలో ఒక్క భారత్‌లోనే 20 శాతం మంది ఉండగా.. యాప్ డౌన్‌లోడ్స్‌లో 15.1 శాతం వాటా ఉంది. 2024 నాటికి 3.7 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ పరిశ్రమ, 2029 నాటికి 9.1 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. గడిచిన ఐదేళ్లలో ఈ రంగంలోని 1800 గేమింగ్ స్టార్టప్‌లలోకి 3 బిలియన్ డాలర్ల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అయితే, ఆన్‌లైన్ రియల్‌మనీ గేమ్స్‌పై నిషేధం విధించడంపై పరిశ్రమ వర్గాల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆన్‌లైన్ గేమింగ్ సమగ్రతను ఈ బిల్లు కాపాడుతోందని కొందరు చెబుతుండగా.. మరికొందరు మాత్రం ఆదాయ మార్గాలు మూసుకుపోయాయని పేర్కొంటున్నారు.

### శిక్షలు ఇలా..!

ఆన్‌లైన్ నగదు గేములకు సంబంధించిన ప్రకటనల్లో పాలు పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికి గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. తరచూ ఈ నేరాలకు పాల్పడేవారికి మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.రెండు కోట్ల వరకూ జరిమానా విధిస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు నేపథ్యంలో ఈ అంశం గూగుల్‌లో ట్రెండ్ అవుతోంది. ఫలానా యాప్ పనిచేస్తుందా? లేదా? విత్‌డ్రా మాటేంటి? అంటూ యూజర్లు ఆరా తీస్తున్నారు.



## సారా ఎంతో కష్టపడి తన కాళ్లమీద
# తాను నిలబడింది : సచిన్

తన కూతురు సారా ఎంతో కష్టపడి తన కాళ్ల మీద తాను నిలబడిందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ ఆనందం వ్యక్తం చేశాడు. సారా ఇటీవలే ముంబయిలో పిలాటిస్ అకాడమీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సచిన్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికగా శుక్రవారం పోస్ట్ పెట్టాడు. దీనిపై అభిమానులు లైక్‌ల వర్షం కురిపిస్తున్నారు. అలాగే కామెంట్లతో సచిన్, సారాకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'సారా పిలాటిస్ స్టూడియోను తెరిచింది. దాన్ని చూడటం మా హృదయాలను ఆనందంతో నింపింది. ఆమె తన స్వయంకృషి, ఆత్మ విశ్వాసంతో ఒక్కో ఇటుకా పేర్చుతూ ఈ స్థాయికి చేరుకుంది. పోషకాహారం, ఫిట్‌నెస్ ఎప్పుడూ మన జీవితాల్లో ముఖ్యం. తనకిష్టమైన రంగంలో ఆమె తన ప్రయాణాన్ని ప్రారంభించడం నిజంగా నాకు చాలా ఆనందంగా ఉంది. సారా నీకు నా అభినందనలు' అంటూ సచిన్ భావోద్వేగ పోస్ట్‌ను షేర్ చేశాడు. సారా ఇటీవలే ముంబయిలోని అంధేరీలో ఈ అకాడమీ ప్రారంభించిన విషయం తెలిసిందే. దుబాయికి చెందిన ఓ సంస్థ భాగస్వామ్యంతో ప్రారంభించారు. ఈ వేడుకలో సచిన్‌తోపాటు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. సారా తెందూల్కర్ మోడలింగ్‌పై మక్కువతో ఇప్పటికే ఫ్యాషన్ మోడల్‌గా రాణించింది. అలాగే ఆమె సర్టిఫైడ్ న్యూట్రిషనిస్ట్ కూడా. అలాగే తన తండ్రి నడుపుతోన్న స్వచ్ఛంద సంస్థ 'సచిన్ తెందూల్కర్ ఫౌండేషన్'కు డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తోంది. ఈ వేదికగా పేద పిల్లల ఆరోగ్య సంరక్షణకు పాటుపడుతోంది. విద్య, ఆటల్లో వాళ్లను ప్రోత్సహిస్తోంది. సోషల్ మీడియాలోనూ ఆమె చురుగ్గా ఉంటోంది.



## కెప్టెన్‌గా రోహిత్‌కు తొలి రోజు నుంచే
# స్పష్టమైన ఆలోచన : ద్రవిడ్

ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ జోడీగా ఐసీసీ ట్రోఫీలను గెలిచారు. వీరిద్దరి హయాంలోనే తొలుత ఆసియా కప్ 2023, టీ20 ప్రపంచకప్ 2024ను భారత్ సొంతం చేసుకుంది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్‌కూ చేరుకుంది. మూడేళ్ల తన పదవీకాలంలో ద్రవిడ్ అద్భుత ఫలితాలు అందించాడు. రోహిత్‌తో తన అనుబంధంపై తాజాగా అశ్విన్ యూట్యూబ్ ఛానల్‌లో ద్రవిడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అలాగే రోహిత్‌తో తనకున్న అనుబంధంపైనా స్పందించాడు. "భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించడం సంతోషంగా ఉంది. రోహిత్‌తో కలిసి పనిచేయడం బాగుంది. జట్టు గురించి అతడు తీసుకొనే జాగ్రత్తలు నిజంగా అద్భుతం. కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు నుంచే టీమ్‌ను ఎలా నడిపించాలనే దానిపై స్పష్టతతో ఉన్నాడు. అందుకోసం ఏం చేయాలో కూడా బాగా తెలుసు. కెప్టెన్ – కోచ్ మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా ముఖ్యం. నేను కోచ్‌గా ఉన్నప్పుడు నమ్మింది ఒకటే. ఇది కెప్టెన్ టీమ్. అతడే జట్టును నడిపిస్తాడు. కోచ్‌గా కీలక సూచనలు చేయడమే నా కర్తవ్యం అని భావించా. నేను ప్లేయర్‌గా, కెప్టెన్‌గా పనిచేశా. అయితే, సారథే జట్టును ఎలా ముందుకుతీసుకెళ్లాలనేది నిర్ణయం తీసుకుంటాడు. అతడికి మద్దతుగా నిలిచి, ఆటకు సంబంధించిన విషయాల్లో కోచ్‌గా సాయం అందించాలి. కొన్ని సందర్భాల్లో కెప్టెన్‌కు స్పష్టత లేకపోవచ్చు. అలాంటప్పుడు పరిస్థితిని అర్థం చేసుకొని ఏం అవసరమో చెప్పాలి. కానీ, రోహిత్ విషయంలో నాకు అలాంటి పరిస్థితి చాలా తక్కువసార్లే ఎదురైంది. జట్టు నుంచి ఏం కావాలి? డ్రెస్సింగ్ రూమ్ ఎలా ఉండాలి? ఎలా ముందుకుసాగాలి? అనే దానిపై పక్కాగా ఉంటాడు. అతడికి ఉన్న అనుభవమే అందుకు కారణం" అని ద్రవిడ్ వెల్లడించాడు.

### నేను చేసింది అదే..

"ప్రధాన కోచ్‌గా నేను మాత్రం కెప్టెన్‌కు ఎలాంటి వాతావరణం ఉండాలో అర్థంచేసుకొని అలా ప్రయత్నించా. కొన్ని విషయాల్లో మాత్రం కొద్దిగా సవాళ్లు ఎదుర్కొన్నా. రోహిత్ ఒక్కసారి కంఫర్ట్‌గా ఫీల్ అయ్యాడంటే అద్భుతంగా ఆడేస్తాడు. తనతోపాటు మిగతా వారూ మంచి ప్రదర్శన చేయాలని ఆశిస్తాడు. వ్యక్తిగతంగానూ రోహిత్‌తో మాట్లాడటం ఆస్వాదించా. మా సంభాషణల్లో చాలాసార్లు కేవలం క్రికెట్ గురించి మాత్రమే కాకుండా.. ఇతర విషయాలూ చర్చకు వచ్చేవి. రోహిత్‌తో కలిసి భోజనం చేయడానికి ఆసక్తి చూపించేవాడిని. అతడిని అండర్–19 రోజుల నుంచి చూస్తున్నా. యువ క్రికెటర్‌గా, కెప్టెన్‌గా, ఓ గొప్ప వ్యక్తిగా ఎదగడం చూశా" అని రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యానించాడు.

# రోహిత్, కోహ్లి ఫిట్‌గానే ఉన్నారు
## వన్డే ప్రపంచ కప్ ఆడాలి : మాజీ క్రికెటర్




టీమ్‌ఇండియా దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఇంకా ఫిట్‌గానే కనిపిస్తున్నారని న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ రాస్ టేలర్ అన్నాడు. వారిద్దరూ 2027 వన్డే వరల్డ్ కప్‌లో కచ్చితంగా ఆడాలని అతడు అంటున్నాడు. అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియాకు జరగనున్న వన్డే సిరీస్ తర్వాత వీరిద్దరూ రిటైర్మెంట్ ప్రకటిస్తారనే ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో టేలర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఇప్పటికీ చాలా ఫిట్‌గా ఉన్నారు. ఇంకా పరుగులు రాబడుతున్నారు. వారు ఎంత ఎక్కువ వీలైతే అంత క్రికెట్ ఆడాలి. క్రికెట్ అభిమానులంతా వారు వన్డే వరల్డ్‌కప్ 2027లో ఆడాలని కోరుకుంటున్నారు' అని రాస్ టేలర్ ఛాంపియన్స్ లీగ్ టీ–10 నోయిడా ట్రోఫీ ఆవిష్కరణ సందర్భంగా అన్నాడు. అలాగే ఐపీఎల్‌లో తాను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడిన సమయంలో విరాట్ కోహ్లితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. 'అప్పుడు విరాట్ కోహ్లి 18–19 సంవత్సరాల యువకుడు. కాస్త బొద్దుగా ఉండేవాడు. భారత జట్టుకు, ఆర్సీబీకి అతడు ఎంతో చేశాడు. ఈ సీజన్‌లోనే ఆర్సీబీ టైటిల్ కూడా సాధించింది' అని టేలర్ వివరించాడు. అలాగే తనకు కోహ్లి మీద ఎప్పుడూ సదాభిప్రాయమే ఉందన్నాడు. అతడిని టీనేజర్‌గా ఎదుగుతున్నప్పటి నుంచి పరిశీలించానని పేర్కొన్నాడు. ఇక ఆర్సీబీ జట్టులో కోహ్లి.. రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, జాక్వెస్ కలిస్ వంటి దిగ్గజ క్రికెటర్లతో డ్రెస్సింగ్‌రూమ్‌ను పంచుకున్నాడు. ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే ఫ్రాంఛైజీ తరఫున ఆడుతున్న ఏకైక క్రికెటర్ కోహ్లి మాత్రమే.

## క్రికెట్‌కు అకస్మాత్తుగా ఎందుకు
# వీడ్కోలు పలికానంటే..? : అశ్విన్



టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ డిసెంబర్ 2024లో అకస్మాత్తుగా తన రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నిర్ణయంతో అందరూ విస్మయానికి గురయ్యారు. బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బాలో జరిగిన మూడో టెస్టు మ్యాచ్ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీనికి గల కారణాన్ని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో.. టీమ్‌ఇండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పంచుకున్నాడు. 'నేను అదే సరైన సమయం అని భావించాను. నా వయసు కూడా ఎక్కువైందని గ్రహించాను. విదేశీ పర్యటనలకు వెళ్లడం వరకు బాగుంది. కానీ తుది జట్టులో చోటు లేకుండా రిజర్వ్ బెంచ్‌కే పరిమితం కావడం నచ్చలేదు. నిజానికి ఇంకాస్త ముందుగానే.. 34–35 ఏళ్లలోనే వీడ్కోలు పలకాలనుకున్నాను' అని అశ్విన్ అన్నాడు. అలాగే కుటుంబంతో సమయం గడపడం కోసం కూడా తాను ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించాడు. అశ్విన్.. టీమ్‌ఇండియా తరఫున 106 టెస్టులు ఆడి 537 వికెట్లు తీసుకున్నాడు. అలాగే బ్యాటింగ్‌లో 3503 పరుగులు చేశాడు. ఇందులో 6 సెంచరీలు, 14 హాఫ్ సెంచరీలున్నాయి. 124.. అశ్విన్‌కు ఈ ఫార్మాట్లో వ్యక్తిగత అత్యధిక స్కోర్. అలాగే అతడు 116 వన్డే మ్యాచుల్లో 156 వికెట్లు తీసుకున్నాడు. 65 టీ20 మ్యాచుల్లో 72 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఐపీఎల్‌లో 221 మ్యాచ్‌లు ఆడి 187 వికెట్లు సాధించాడు. ప్రస్తుతం అశ్విన్.. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అలాగే అతడు.. తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లోనూ ఆడుతున్నాడు. అశ్విన్ మైదానంలో చివరిసారిగా టీఎన్‌పీఎల్.. ఫైనల్ మ్యాచ్‌లో దిండిగల్ డ్రాగన్స్ తరఫున ఆడాడు. ఈ పోరులో దిండిగల్‌పై తిరుప్పూర్ జట్టు 118 పరుగుల తేడాతో విజయం సాధించింది.

## త్వరలో భారత్‌కు
# ఓపెన్ ఏఐ యూనిట్..




చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించడంపై దృష్టిసారించింది. దీనిలోభాగంగా భారత్ రాజధాని న్యూదిల్లీలో ఈ ఏడాది చివర్లో కార్యాలయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. భారత్‌లో చాట్ జీపీటీ వినియోగం గణనీయంగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకొంది. "భారత్‌లో ఏఐకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. గ్లోబల్ ఏఐ లీడర్‌గా ఎదిగేందుకు అవసరమైన అన్ని అంశాలు భారత్‌లో ఉన్నాయి. ప్రతిభ, ప్రపంచస్థాయి డెవలపర్ సిస్టమ్, ఇండియా ఏఐ మిషన్ ద్వారా బలమైన ప్రభుత్వ మద్దతు లభిస్తోంది. భారత్‌లో తొలి ఆఫీస్‌ను ప్రారంభించి స్థానిక టీమ్‌ను ఏర్పాటుచేయడం ఆ మిషన్‌కు కట్టుబడి భారత్‌లో కృత్రిమ మేధను మరింత అదుబాటులోకి తెస్తామన్న నిబద్ధతకు మొదటి మెట్టు" ఓపెన్ ఏఐ సీఈవో శామ్‌ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. అయితే ఈవిషయాన్ని భారత ప్రభుత్వం కూడా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు ఓపెన్ ఏఐ ఇప్పటికే ఇండియాఏఐ మిషన్ భాగస్వామి అయ్యేందుకు అంగీకరించిన విషయం తెలిసిందే. దీనిలోభాగంగా ప్రభుత్వం కోసం ఏఐ వ్యవస్థల నిర్మాణం జరుగుతుంది. ఇందులో పాల్గొనడం ద్వారా భారత్‌లో తమ సేవలు మరింత మెరుగుపడతాయని ఆ సంస్థ భావిస్తోంది. ప్రస్తుతం భారత్‌లో లక్షల మంది విద్యార్థులు, ఎడ్యుకేటర్లు, ప్రొఫెషనల్స్, డెవలపర్లు దీనిని వాడుతున్నారు. చాట్‌జీపీటీ తాజా డేటా ప్రకారం అమెరికా తర్వాత రెండో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ నిలిచింది. వీక్లీ యాక్టివ్ యూజర్ల సంఖ్య కూడా గతేడాదితో పోలిస్తే 4 రెట్లు వేగంగా పెరుగుతోంది. ఇక ఓపెన్ ఏఐ వేదికపై ఉన్న టాప్–5 డెవలపర్స్ మార్కెట్‌లో భారత్ కూడా ఒకటి. ఇక చాట్‌జీపీటీలో అత్యధిక విద్యార్థులు ఉన్న దేశం కూడా ఇదే. భారత్‌లో 'చాట్‌జీపీటీ గో' పేరుతో ఓపెన్ ఏఐ కొత్త సేవలు ప్రకటించింది. రూ.399కే ఈ ప్లాన్ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది. మెసేజ్‌లు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్‌ల సంఖ్యను భారీగా అనుమతించనుంది. ఇండిక్ లాంగ్వేజీ సపోర్టుతోపాటు యూపీఐతోనూ చెల్లింపులు చేసే సౌలభ్యాన్ని తీసుకొచ్చినట్లు తెలిపింది.



# భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. జాక్సన్ హెూల్ సింపోజియంలో అమెరికా ఫెడ్ చీఫ్ వడ్డీ రేట్లపై ఎలాంటి ప్రకటన చేయబోతున్నారనే దానిపై మదుపర్లలో ఆసక్తి నెలకొంది. దీనికితోడు భారత్‌పై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ విధించిన 25 శాతం అదనపు సుంకాల బాదుడు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానుంది. ఈ గడువు దగ్గర పడడంతో వారాంతంలో మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. దీంతో మార్కెట్ సూచీల ఆరు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 25 వేల స్థాయి దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,951.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,000.71) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,291.77 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 693.86 పాయింట్ల నష్టంతో 81,306.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 213.65 పాయింట్ల నష్టంతో 24,870.10 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.53గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, సన్‌ఫార్మా, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.46 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,329.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### కారణాలు ఇవీ..

- సెప్టెంబర్‌లో జరిగే పరపతి విధాన సమీక్షలో ఫెడ్ 25 బేసిస్ పాయింట్లు వడ్డీ రేట్లు కట్ చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనిపై ఈ రాత్రికి జరిగే జాక్సన్ హెూల్ సింపోజియంలో జెరోమ్ పావెల్ ఏదైనా వ్యాఖ్యలు చేస్తారని మదుపర్లు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. అమెరికా వడ్డీ రేట్లు తగ్గిస్తే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు కలిసొస్తుంది.
- రష్యా చమురును కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25 శాతం అదనపు సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 27 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ గడువు దగ్గర పడడంతో మదుపర్లలో ఆందోళన నెలకొంది. ఇది భారత వృద్ధిని దెబ్బతీస్తుందన్న భయాలు ఉన్నాయి.
- మన మార్కెట్ సూచీలు వరుసగా ఆరు రోజుల పాటు రాణించాయి. ఈ క్రమంలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. ముఖ్యంగా ఫైనాన్షియల్, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు నష్టపోయాయి.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# గోవాలో చిరు బర్త్‌డే వేడుకలు

మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ఆయన తన కుటుంబంతో కలిసి గోవాలో వేడుకలు జరుపుకున్నారు. బర్త్‌డే వేడుకలు ఎంతో ఘనంగా, సంతోషంగా జరుగుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా చిరుకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిరు తనయుడు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. వీడియోలో చరణ్ తండ్రికి కేక్ తినిపిస్తూ, చిరు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు. చిరంజీవి కూడా చరణ్‌కు కేక్ తినిపిస్తూ కుమారుడిపై తనకున్న ప్రేమని తెలియజేశారు. అయితే రామ్ చరణ్ తన తండ్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెట్టిన పోస్ట్ అందరిని టచ్ చేసింది. 'ఇది కేవలం మీ పుట్టినరోజు మాత్రమే కాదు నాన్న... ఇది మీ లాంటి గొప్ప వ్యక్తికి జరుపుతున్న గొప్ప సంబరమూ! నా హీరో, నా గైడ్, నా ప్రేరణ మీరు. నా ప్రతి విజయం, నేను మోసే విలువలు అన్నీ మీ నుంచే వచ్చాయి. 70 ఏళ్ల వయసులో కూడా మీరు మా హృదయంలో యువకుడిగా ఉండి, మాకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మీరు ఆనందంగా, ఆరోగ్యంగా మరెన్నో సంవత్సరాలు ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఎవరైనా కోరుకునే ఉత్తమ తండ్రిగా ఉన్నందుకు ధన్యవాదాలు నాన్న అంటూ రామ్ చరణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. మెగా అభిమానులు ఈ వీడియోను పెద్దఎత్తున షేర్ చేస్తూ హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాని షేక్ చేస్తున్నారు.



## సుందరివే.. కానీ ఎరుపు చీరే ప్రమాదం

"నువ్వు సుందరివే.. కానీ నీ ఎరుపు రంగు చీరే ప్రమాదకరంగా కనిపిస్తుంద"ని తన ప్రేయసితో కబుర్లు చెప్తున్నాడు బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా. ఆయన, అందాల తార జాన్వీ కపూర్ జంటగా నటించిన చిత్రం 'పరమ్ సుందరి'. ఈ ప్రేమకథా చిత్రాన్ని తుషార్ జలోటా తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నెల 29న రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా తాజాగా ఇందులోని 'డేంజర్..' అనే మరో గీతాన్ని అభిమానులతో పంచుకుంది చిత్రబృందం. 'రెడ్ అలర్ట్' అంటూ మొదలైన ఈ గీతంలో హుక్ స్టెప్పులతో అదరగొడుతున్నారు సిద్ధార్థ్, జాన్వీ.

## చిరుకు అభినందల వెల్లువ

### బర్త్‌డే విషెస్ తెలిపిన బాబు

ఇక చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న మెగా 157 సినిమా టైటిల్ గ్లింప్స్ బర్త్‌డే సందర్భంగా విడుదలైంది. చిరు లుక్ ఆకట్టుకుంటూ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నింపింది. 70 ఏళ్ల వయసులోనూ యంగ్ అండ్ ఎనర్జిటిక్, ఇన్‌స్పైరింగ్ లీడర్‌గా నిలుస్తున్న చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ, దేశం అంతటా అభిమానుల సందడి కొనసాగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారికి హృదయపూర్వక 70వ జన్మదిన శుభాకాంక్షలు. సినీ ప్రయాణం, ప్రజా జీవితం, సేవా కార్యక్రమాల్లో మీ విశిష్టమైన ప్రస్థానం లక్షలాది మందికి ఎంతో స్ఫూర్తినిచ్చింది. మీ ఉదారత, అంకితభావంతో మరెన్నో జీవితాలకు వెలుగునిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. ఆనందం, ఆరోగ్యంతో మీరు సంతోషంగా కలకాలం జీవించాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.




## మన శంకర వరప్రసాద్ టైటిల్ ఖరారు

### వెంకటేశ్ వాయిస్‌తో విడుదల

మెగా157 । మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు 2025 పుట్టినరోజు మరపురాని వేడుకగా మారబోతోంది. ఫ్యాన్స్ ఆశించినట్లుగానే క్రేజీ అప్‌డేట్స్ వరుసబెట్టి వచ్చేస్తున్నాయి. మెగా అభిమానులు మాత్రమే కాదు, సినీ ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిరంజీవి అనిల్ రావిపూడి సినిమా టైటిల్, గ్లింప్స్ ఎట్టకేలకి విడుదలైంది.చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు అనే టైటిల్ కొద్ది రోజులుగా ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతుండగా, అదే టైటిల్‌ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ టైటిల్‌ను విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్‌తో అందించడం స్పెషల్ హైలైట్. చిరంజీవి, వెంకటేష్ మధ్య మంచి స్నేహబంధం ఉండటంతో, ఈ ప్రాజెక్ట్‌లో వెంకీ కీలక పాత్రలో కనిపించనున్నారు. గ్లింప్స్ లో చిరంజీవి సూట్ ధరించి సిగరెట్ తాగుకుంటూ అలా వస్తుండడం చూసి ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. చివరిలో గుర్రం పట్టుకొని నడుచుకుంటూ వచ్చే షాట్ కూడా అదిరిపోయింది. ఇక మన శంకర వర ప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు అంటూ వెంకీ చెప్పడం మరో హైలైట్ అయింది. ఈ సినిమా 2026 సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతోంది. గతంలో అనిల్, వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 వంటి హిట్ కామెడీ ఎంటర్ టైనర్లు సంక్రాంతికి రిలీజై ఘన విజయం సాధించిన నేపథ్యం చూస్తే, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ కావొచ్చన్న అంచనాలు బలపడుతున్నాయి. చిరంజీవి నటిస్తున్న ఫ్యాంటసీ డ్రామా 'విశ్వంభర' నుంచి గ్లింప్స్ ఇప్పటికే రిలీజ్ కాగా, ఇది అలరించింది. ఈ చిత్రం 2026 వేసవిలో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. ఇక ఈ రోజు సాయంత్రం చిరంజీవి బాబీ కొల్లి కాంబోలో మరో కొత్త సినిమా అనౌన్స్‌మెంట్ ఉంటు ంది. 'వాల్తేరు వీరయ్య' తరహాలోనే మాస్ మజా ఉన్న సినిమా ఉండబోతుందని సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుంది.

## సైన్యానికి రాజువై నడిపించు

### పవన్‌కు చిరు ఆశీస్సులు


నీకు తమ్ముడిగా పుట్టడం నా అదృష్టమంటూ చిరంజీవికి పవన్ విషెస్ చెప్పగా.. నీకు అన్నయ్యని అయినందుకు ఎంతో ఆనందంగా ఉందని చిరు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి నేడు 70వ పుట్టినరోజు చేసుకుంటు న్నారు. ఈసందర్భంగా ఆయనకు సోషల్ మీడియాలో పవన్ ఆయనకు విషెస్ చెప్పారు. ఆ శుభాకాంక్షలకు చిరంజీవి స్పందిస్తూ ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ్ముడికి ప్రేమతో ఓ నోట్ విడుదల చేశారు. తమ్ముడు కల్యాణ్.. ప్రేమతో నీవు పంపిన పుట్టినరోజు శుభాకాంక్షలు అందాయి. అందులోని ప్రతి మాట.. ప్రతి అక్షరం నా హృదయాన్ని తాకింది. నన్ను చూసి నువ్వెంత (శూశ ఔశశా) గర్విస్తున్నావో.. నీ విజయాల్ని, నీ పోరాటాన్ని నేనూ అంత గా ఆస్వాదిస్తున్నాను. నీ కార్యదీక్ష, పట్టుదల చూసి ప్రతి క్షణం గర్వపడుతూనే ఉన్నా. నిన్ను నమ్మినవాళ్లకు ఏదో చేయాలన్న తపనే నీకు ఎప్పటికప్పుడు కొత్త శక్తిని ఇస్తుంది. ఈ రోజు నీ వెనక కోట్లాదిమంది జన సైనికులు ఉన్నారు. ఆ సైన్యాన్ని ఓ రాజువై నడిపించు. వాళ్ల ఆశలకు, కలలకు కొత్త శక్తినివ్వు. అభిమానుల ఆశీర్వాదం, ప్రేమ నీకు మెండు గా లభిస్తూనే ఉండాలి. ఓ అన్నయ్యగా నా ఆశీర్వచనాలు ఎప్పుడూ నీకు ఉంటాయి. నీ ప్రతి అడుగులోనూ విజయం నిన్ను వరించాలని ఆ భగవంతుడ్ని కోరుకుంటు న్నాను' అంటూ అరుదైన ఫొటోలను షేర్ చేశారు.



## బాలయ్య ఎనర్జీకి ఫిదా అవ్వాల్సిందే


### అఖండ 2 విలన్ ఆది పినిశెట్టి

నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ గారు ఒక వ్యక్తి కాదు... ఓ శక్తి. ఆయన ఒరిజినల్ గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉ ంటుంది. బాలయ్య బోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉ ంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది. తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉ ంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రగ్యా జైస్వాల్, సంయుక్త మీనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.





## సరదాగా సాగిన...పరదా మూవీ



చాలా రోజుల తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన మరో నాయికా ప్రధానమైన చిత్రం 'పరదా' . కమర్షియల్ సినిమాల్లో సగటు హీరోయిన్‌గా, పక్కింటి అమ్మాయిగానే కనిపించిన అనుపమ పరమేశ్వరన్ ఇందులో ప్రధాన పాత్రధారి. యువ దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పడతి అనే ఓ కల్పితమైన ఊరు నేపథ్యంలో సాగే కథ ఇది. అక్కడ ప్రతి యువతీ పరదా కప్పుకొనే తిరగాలనేది ఆచారం. పరదా తీసినట్టు రుజువైతే మాత్రం గ్రామ దేవత జ్వాలమ్మ ముందు ఆత్మార్పణ చేసుకోవాల్సి ఉంటుంది. అనాదిగా వస్తున్న ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఊరి యువతి సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) ఊహించని రీతిలో చిక్కుల్లో పడుతుంది. పరదా లేని ఆమె ఫొటో బయటకి రావడమే అందుకు కారణం. తాను ఆచారాన్ని తప్పలేదని వేడుకున్నా... ఆత్మార్పణ చేసుకోవాల్సిందే అని ఊరి ప్రజలు తీర్మానం చేస్తారు. ఒక పక్క తాను మనసిచ్చిన రాజేశ్ (రాగ్ మయూర్)తో నిశ్చితార్థానికి సిద్ధం అవుతుండగానే ఇదంతా జరుగుతుంది. ఆచారం ప్రకారం ప్రాణాలైనా వదలాలి, లేదంటే తప్పు చేయలేదనైనా నిరూపించుకోవాలని కోరతారు ఊరి ప్రజలు. దాంతో సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకోవడం కోసం ధర్మశాలకి పయనం కావాల్సి వస్తుంది. ఆ ప్రయాణం ఎలా సాగింది? తనకి తోడుగా నిలిచిన రత్న (సంగీ), అమిష్ట (దర్శన రాజేంద్రన్) ఎవరు? ఇంతకీ పరదా లేని సుబ్బు ఫొటో ఎలా బయటికొచ్చింది? పడతి అనే ఊరు అనుసరిస్తున్న కఠినమైన ఆ కట్టుబాటు వెనక చరిత్ర ఏమిటి?సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకుందా లేదా అన్నకథలో సాగిందీ సినిమా. అప్పుడప్పుడూ కొత్త కథలు అరుదుగా వస్తుంటాయి. చాలా రోజుల తర్వాత తెలుగు తెరపైకి వచ్చిన ఓ కొత్త కథ... 'పరదా'. హీరో, హీరోయిన్, కమర్షియాలిటీ ... తరహా లెక్కల్ని పట్టించుకోకుండా చేసిన ఓ సాహసోపేతమైన ప్రయత్నం. ముగ్గురు మహిళల స్నేహాల్ని, ఒకరి సమస్య కోసం ముగ్గురూ కలిసి చేసిన స్వేచ్ఛా విహారాన్ని అందంగా, ఆలోచన రేకెత్తించేలా ఆవిష్కరిస్తుంది. దైనందిన జీవితాల నుంచి బయటికొచ్చి చేసిన ఆ ప్రయాణం వాళ్లకు ఏం నేర్పింది?వాళ్లలో ఎలాంటి మార్పుని తీసుకొచ్చింది? సమాజం ముందు ఎలాంటి ప్రశ్నల్ని లేవనెత్తిందన్నది ఇందులో కీలకం. లింగ సమానత్వం అంశాన్ని ఓ కొత్త కోణంలో ఆవిష్కరించిదీ చిత్రం. సమానత్వం అంశం ఎప్పుడు ప్రస్తావనకి వచ్చినా అవతలి వాళ్లవైపు వేళ్లు వెళుతుంటాయి. కానీ, ఈ సినిమా అందుకు భిన్నమైన విషయాల్నీ ప్రస్తావించింది. మనుషుల్లో మార్పుని, ఆ అవసరాన్ని సూచిస్తుంది. అయితే, చెబుతున్న కథ కొత్తదైనా... పాతదైనా తెరపై ఎంత ఆసక్తికరంగా సాగిందన్నదే కీలకం. సన్నివేశాలన్నీ ఒక విహారయాత్ర డాక్యుమెంటేషన్‌లా అనిపిస్తుంది తప్ప, కథ కథనాలు ఏమాత్రం ఆసక్తిని రేకెత్తించవు. ముగింపుతోపాటు పతాక సన్నివేశాలు ఆకట్టు కుంటాయి. సుబ్బు పాత్రలో ఒదిగిపోయింది అనుపమ పరమేశ్వరన్. ప్రతి సినిమాలోనూ తన కళ్లతోనే భావాలు పలికించే ఆమె ఈ సినిమాలో ఎక్కువభాగం సన్నివేశాల్లో పరదా కప్పుకొనే కనిపిస్తూ ఉంటుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com